




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 07 గురువారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 323

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# అమెరికా హెచ్చరికలను లెక్కచేయని భారత్

## రష్యా పర్యటనకు అజిత్ దోవల్


- చమురు కొనుగోళ్లపై అమెరికా ఒత్తిడిని నిర్లక్ష్యం చేసిన భారత్
- రక్షణ, ఇంధన రంగాల్లో సహకారానికి దోవల్ పర్యటన దోహదం
- రష్యా-భారత్ వ్యూహాత్మక సంబంధాల పునఃస్థాపనకు అడుగులు
- సు-400,సు-57 లాంటి హైటెక్ ఆయుధాలపై చర్చలు
- చమురు, గ్యాస్ సరఫరాకు సురక్షిత మార్గాల అన్వేషణ
- జైశంకర్ రష్యా పర్యటనకు సన్నద్ధం -ద్వైపాక్షిక చర్చలకు నేపథ్యం
- విదేశాంగ విధానంలో స్వతంత్రతకు భారత్ కట్టుబడి ఉంది
- భారత్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సమాధానం - విమర్శలు తగవు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాస్కోలో పర్యటించడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయకుండా భారత్ తన విదేశాంగ విధానాన్ని స్వతంత్రంగా కొనసాగిస్తుందనడానికి ఇది ఒక స్పష్టమైన సంకేతంగా నిలుస్తుండగా అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పర్యటనలో ఆయన రష్యాతో రక్షణ, ఇంధన సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. భారత్-రష్యాల మధ్య ఉన్న వ్యూహాత్మక బంధం చాలా కాలం నాటిది. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్నప్పటికీ.. సుంకాలతో పాటు పెనాల్టీలు కూడా విధించారు. అది చాలదన్నట్లు మంగళవారం రోజే మరింతగా సుంకాలు పెంచుతామంటూ మళ్లీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ బెదిరింపుల తర్వాతే అజిత్ దోవల్ మాస్కో పర్యటనకు వెళ్లడం ఒక ముఖ్యమైన పరిణామంగా నిలుస్తోంది. అయితే ఈ పర్యటన ముందే నిర్ణయించినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో దీనికి అధిక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో అజిత్ దోవల్ రక్షణ రంగంలో సహకారం, S-400 క్షిపణి వ్యవస్థలు, Su-57 యుద్ధ విమానాల వంటి అత్యాధునిక ఆయుధాల కొనుగోలుపై చర్చించారు. అంతేకాకుండా ఇంధన భద్రతకు సంబంధించి మంత్రిత్వ శాఖ కూడా ఈ విషయమై స్పందించింది. రష్యాతో భారతదేశ సంబంధాలు పరస్పర అవగాహన, జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయని, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు సమర్థనీయమేనని స్పష్టం చేసింది. పాశ్చాత్య దేశాలు కూడా రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగిస్తున్నాయని, కాబట్టి భారత్‌పై విమర్శలు తగవని పేర్కొంది. ఆగస్టు నెలలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా రష్యాలో పర్యటించడానికి సిద్ధం అవుతున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశం



## ఈడీ విచారణకు హాజరైన నటుడు విజయ్

- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ఈడీ దూకుడు
- సెలబ్రిటీల ప్రమోషన్‌తో మనీలాండరింగ్ అనుమానాలు

2



2

## సంక్షేమ పథకాల్లో సీఎం ఫోటో, పేరు వాడొచ్చు..: సుప్రీంకోర్టు సంచలనం

- సుప్రీంకోర్టు తీర్పుతో తమిళనాడు ప్రభుత్వానికి ఊరట
- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వును కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం

3



## ఏఐ ఉద్యోగాలను తొలగించదు పెంచుతుంది

- కృత్రిమ మేధస్సుపై భయాలు... ఉద్యోగాల భవితవ్యం ఏమిటి?
- ఏఐ వల్ల కొత్త ఉద్యోగావకాశాలు -గోయెంకా వెల్లడించిన 3 కీలక భవిష్యత్ రోల్స్
- కార్యాలయాల రూపురేఖలు మారనున్నాయా? - స్మార్ట్ వర్క్‌కు భవిష్యత్!
- నైపుణ్యాలెందుకు ముఖ్యం?-యువతకు గోయెంకా సూచనలు
- నెటిజన్ల స్పందన: భయాన్ని కాదు, అవకాశాలను చూడాలి
- వినోద్ ఖోస్లా అభిప్రాయం-ఏఐ ట్యూటర్లు విద్యా రంగంలో మార్పులకు నాంది

2


**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో ఉద్యోగాలను కష్టతరం చేస్తుందని చాలా మంది భావిస్తుంటే, ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా మాత్రం దీనిపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ కేవలం ఉద్యోగాలను తీసివేయదని.. బదులుగా పని తీరును పూర్తిగా మెరుగు పరిచి.. సరికొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు. ఈ విషయమై ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ మార్పుకు అనుగుణంగా మనం సిద్ధంగా ఉండాలని, నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన యువతకు సూచించారు. ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా ఎక్స్ వేదికగా చేసిన తన పోస్ట్‌లో.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందనే అంతా ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. కానీ ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకు వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ కారణంగా భవిష్యత్తులో మూడు ప్రధాన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని స్పష్టం చేశారు.

## హెూంమంత్రిగా అమిత్‌షా సరికొత్త రికార్డు

- లాల్‌కృష్ణ అద్వానీ రికార్డు బ్రేక్ చేసిన అమిత్ షా
- మూడే 3 కీలకనిర్ణయాలే అమిత్‌షాని నిలబెట్టాయి
- ఆర్టికల్ 370 రద్దు - చారిత్రక మార్పుకు నాంది
- కొత్త క్రిమినల్ చట్టాలు - బ్రిటీష్ చట్టాలకు గుడ్‌బై
- నక్సలిజంపై సమగ్ర పోరాటానికి పటిష్టమైన వ్యూహం
- ఈశాన్య రాష్ట్రాల్లో 12 శాంతి ఒప్పందాలు
- భద్రతా వ్యవస్థను బలోపేతం చేసిన హెూంమంత్రి

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

భారత రాజకీయ చరిత్రలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఒక కొత్త రికార్డును నెలకొల్పారు. ఆగస్టు 5వ తేదీ మంగళవారం నాటితో అత్యధిక కాలం హెూంమంత్రిగా పని చేసిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. గతంలో బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ 2,256 రోజులు హెూంమంత్రిగా పని చేసిన రికార్డును అమిత్ షా బద్దలు కొట్టారు. ప్రస్తుతానికి ఆయన 2,258 రోజులకు పైగా ఈ పదవిలో కొనసాగుతున్నారు. అయితే అమిత్ షా ఈ రికార్డు సాధించడానికి, సుదీర్ఘకాలం హెూంమంత్రిగా కొనసాగడానికి ఆయన తీసుకున్న మూడే మూడు నిర్ణయాలు కారణం అని నిపుణులు భావిస్తున్నారు. మరి అవేంటో మనం ఇప్పుడు తెలుసుకుందామా..?అమిత్ షా హెూంమంత్రిగా చేసిన సమయంలో.. దేశ భవిష్యత్తులోనే మూడు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ

## రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం

- రాహుల్ గాంధీనే ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన రేవంత్
- బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా
- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ నిరాకరణపై ఆవేదన
- బీసీ బిల్లు ఆమోదంలో కేంద్రం నిర్లక్ష్యానికి తీవ్ర విమర్శ
- కులగణన దేశవ్యాప్తంగా అమలవ్వాలన్న డిమాండ్
- బిల్లు ఆమోదం లేకపోతే ప్రధాని మోదీకి గద్దె దింపే హెచ్చరిక
- బీసీ హక్కుల కోసం ఇండియా కూటమి మద్దతు
- బీసీల పేరిట ముస్లింలను అడ్డంకిగా చూపిస్తున్న బీజేపీపై ఘాటైన విమర్శ



2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అంత కదం తొక్కారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలుకు ధర్నా చేపట్టారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు వదలము అని నినదాలు చేశారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు.

**బిల్లును ఆమోదించలేదు..**బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి.. రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రపతి బిల్లును ఆమోదించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దుతు ఇస్తుందని పేర్కొన్నారు.

**అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు..**బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో దేశంలోనూ జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. తమకు అపాయింట్ మెంట్ ఇవ్వొద్దని మోదీ, అమిత్‌షా చెప్పి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**కేంద్రంపై విమర్శలు..**బీసీ బిల్లు ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలో మోదీ వ్యూహం

### ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేరు తెరపైకి

- దక్షిణాదికి అవకాశం మైనార్టీకి పదవి ఖాయమే?
- బీహార్ ఆశలు ఆవిరి - సమీకరణాలు మారిన వేళ
- ఇండియా బ్లాక్‌ను డిఫెన్స్‌లోకి నెట్టే ప్రయత్నం
- నజీర్‌ను ఎంపిక చేస్తే రాజకీయ లబ్ధి
- లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ టార్గెట్ తమిళనాడు?

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఊహించని ట్విస్టులు చోటుచేసుకుంటున్నాయి. జగదీప్ ధన్‌కర్ రాజీనామా తర్వాత కొత్త లెక్కలు తెరమీదకు వచ్చాయి. నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదలైంది. ఎన్డీయే అభ్యర్థి ఖరారు తర్వాత ఇండియా బ్లాక్ నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే కొత్త ఉపరాష్ట్రపతిగా పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే

## మహిళలకు ఉచిత ప్రయాణం మార్గదర్శకాలు

**కేబినెట్‌లో కీలక నిర్ణయాలు**

- 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పథకం అమలు
- విద్యార్థినులకూ ప్రత్యేక పాస్ అవసరం లేదు
- జీరో టికెటింగ్ విధానంతో ప్రయాణ సౌకర్యం
- రేషన్ కార్డుల జారీకి ఆమోదం
- భూముల కేటాయింపుపై సీఎం ప్రత్యేక భేటీ

2



## కర్తవ్య భవన్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశ రాజధాని ఢిల్లీ లో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ (బుధవారం) ప్రారంభించారు.కంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హెూంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, పెట్రోలియం శాఖలతోపాటు ప్రధానమంత్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళ్లనున్నాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే.ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే నూతన భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. అన్ని కార్యాలయాలు కొత్త భవనాల్లోకి మారిన తర్వాత పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలువనున్నట్లు సమాచారం.

## తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి

- 9లోగా వివరాలు సమర్పించాలన్న అత్యున్నత న్యాయస్థానం
- ఎస్ఐఆర్ పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్' దాఖలు చేసిన పిటిషన్
- ముసాయిదా ఓటర్ల జాబితాలో భారీ తొలగింపుపై అభ్యంతరం
- తొలగింపులకు కారణాలు ఎందు చెప్పలేదన్న ప్రశాంత్ భూషణ్ వాదనలు
- రాజకీయ పార్టీలకు అందిన జాబితా -ఎన్‌జీవోకూ ఇవ్వాలని కోర్టు ఆదేశం
- వివరాలు ఇస్తాం, తర్వాత కారణాలు వెల్లడిస్తాం:ఈసీ సమాధానం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన ఎన్నికల కమిషన్ ఈనెల 1న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 65 లక్షల మందిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారంనాడు ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలను ఆగస్టు 9వ తేదీలోగా తమకు సమర్పించాలని ఆదేశించింది.బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌ను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీఓ గతంలో సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం మరోసారి కోర్టును ఆశ్రయించింది. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను ఇచ్చినప్పటికీ ఓటర్ల తొలగింపునకు కారణాలు చెప్పలేదని ఎన్‌జీపీ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తమ వాదనలు వినిపించారు.దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో

## బీసీలకు బీజేపీ పంగనామం.. మంత్రి సీతక్క ఫైర్

- బీసీలకు రిజర్వేషన్‌పై మంత్రి సీతక్క కృతజ్ఞతలు
- అసెంబ్లీలో మద్దతు, ఢిల్లీలో మౌనం - బీజేపీపై విమర్శలు
- బీసీల ఆత్మగౌరవంపై బీజేపీకి అగౌరవమే
- ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే బీజేపీ
- ముస్లింలు బీసీలుగా-గుజరాత్, యూపీ ఉదాహరణ
- పీఎంఓలో బీసీలు లేరని సీతక్క ఆరోపణ
- రాహుల్ గాంధీకి సీతక్క ప్రశంసలు-

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

రాహుల్ గాంధీ ఇచ్చిన 'ఎవరెంతో వారికంత' అనే నినాదంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్రకుల రెడ్డి సామాజిక వర్గాల నుండి వచ్చినప్పటికీ, వెనుకబడిన వర్గాలకు మద్దతుగా బీసీ రిజర్వేషన్లను ముందుకు తీసుకువస్తున్నందుకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలియజేశారు. ఢిల్లీ వేదికగా ఆమె బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ ద్వంద్వ వైఖరి బీజేపీ పార్టీ తెలంగాణ

## ఏపీ సర్కార్ మరో ఉచిత హామీ నేటి నుంచే అమలు

- ఏపీ ప్రభుత్వ మరో ఉచిత హామీ అమల్లోకి
- చేనేత కార్మికుల కోసం ప్రత్యేక ప్యాకేజ్
- జీఎస్టీ భారం సర్కారే భరిస్తుందని సీఎం ప్రకటన
- మగ్గాలకు ఉచిత విద్యుత్ - 200 నుండి 500 యూనిట్లు
- రూ.5 కోట్లతో నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్
- జాతీయ చేనేత దినోత్సవం నుంచే అమలు



2

**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు కు ఆదేశాలు జారీ అయ్యాయి. రేపు (గురువారం) నుంచే ఈ పథకం అమలు కానుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు ప్రారంభం కానుంది. దీనికి ముందే మరో హామీ అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విధి విధానాలు ఖరారు చేసారు. ! అమల్లోకి మరో హామీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. నేతన్నలకు చేయూత ఇచ్చేలా కొత్త నిర్ణయాలు తీసుకున్నారు. అదే విధంగా హ్యాండ్లూమ్ వస్త్రాలపై జీఎస్టీని సర్కారే భరించేలా సీఎం చంద్రబాబు ఆదేశించారు. మగ్గాలకు 200, పవర్?లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్



# ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జేడీ శీలం, మస్తాన్ వలి

**కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్**

**హైదరాబాద్-నవభూమి:** ఆంధ్రప్రదేశ్‌లో వరుస ఎన్నికల పరాజయాల తర్వాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ)కి ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించింది. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీల ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమిస్తూ బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నియామకాలకు ఆమోదం తెలిపినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు జరిపినట్లు తెలుస్తోంది. దీంతో పాటు 25 మంది సీనియర్ నేతలతో పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ వ్యవహరించనున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పళ్లంరాజు, చింతా మోహన్, జేడీ శీలం వంటి ప్రముఖులకు ఈ కమిటీలో సభ్యులుగా చోటు కల్పించారు. వీరితో పాటు కేవీపీ రామచంద్రరావు, కె.రాజు, మస్తాన్ వలీ, జీవీ హర్షకుమార్, ఎన్. తులసిరెడ్డి వంటి అనుభవజ్ఞులైన నేతలను కూడా కమిటీలో చేర్చారు.

గత కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోసం పోరాడుతోంది. రాష్ట్ర విభజన తర్వాత 2014, 2019 ఎన్నికల్లో పార్టీ ఖాతా తెరవలేకపోయింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కొద్ది నెలల ముందు వైఎస్ షర్మిల ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినా, ఫలితాల్లో మార్పు రాలేదు.

## ఈడీ విచారణకు హాజరైన నటుడు విజయ్ దేవరకొండ

**హైదరాబాద్-నవభూమి:** అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ బెట్టింగ్ యాప్ కేసులో నేడు ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని నటుడు ప్రకాశ్ రాజ్‌తో పాటు పలువురు నటులకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో గత నెల 30న ప్రకాశ్ రాజ్ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే నేడు విచారణకు రావాలని విజయ్‌కి నోటీసులు జారీ చేయగా.. తాజాగా అతడు ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పలువురు సినీ సెలబ్రిటీలపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే హీరోలు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండతో పాటు రానా దగ్గుబాటి, నటి మంచు లక్ష్మి వంటి వారికి కూడా ఈడీ నోటీసులు పంపింది. రానా దగ్గుబాటి ఇప్పటికే విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. సినిమా షూటింగ్‌లు ఉండడంతో విచారణకు మరికొంత సమయం కోరాడు.

## ఒక పార్టీని టార్గెట్ చేస్తారా.. ఎంపీపై సుప్రీం అసహనం, రూ.10 లక్షల జరిమానా



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ పథకాలకుతమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేరు వాడుకోవడంపై మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ) బుధవారంనాడు తోసిపుచ్చింది. ప్రభుత్వ పథకాల్లో సీఎం ఫోటోలను ఉపయోగించే విధాన్ని దేశమంతా అనుసరిస్తోందని, పిటిషనర్‌కు నిజంగానే అంత ఆందోళన ఉంటే ఒక పార్టీనే ఉద్దేశించి కాకుండా అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాలు చేయలేదని నిలదీసింది. 'మీ రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేయవద్దు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషన్ వేసిన అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధించింది. 'విత్ యు స్టాలిన్' పేరుతో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాన్ని ఇటీవల మద్రాసు హైకోర్టులో షణ్ముగం సవాలు చేశారు. దీనిపై ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. రాజకీయ నేతల పేర్లతో ఉన్న పథకాలపై గతంలో ఇచ్చిన తీర్పుల్లో ఎలాంటి న్యాయపరమైన నిషేధాజ్ఞలు లేవన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, పలు ప్రభుత్వ పథకాల్లో సీఎంలు, ప్రధాని ఫోటోలను ఉపయోగించే విధానాన్ని దేశమంతా అనుసరిస్తోందని, ఇందుకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతిచ్చిందని పేర్కొంది. రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేయవద్దని అసహనం వ్యక్తం చేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చింది.

## రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం

**(1వపేజీ తరువాయి)** కేంద్రానికి బిల్లు పంపి 4 నెలలు అవుతున్నా ఆమోదించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తున్నా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకపోతే.. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధాని చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామని ప్రతిఘటించారు. రిజర్వేషన్లు ముస్లింల కోసం కాదు.. బలహీన వర్గాల కోసం ఆయన స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

## అమెరికా హెచ్చరికలను లెక్కచేయని భారత్

**(1వపేజీ తరువాయి)** కానున్నారు. ఈ పర్యటన కూడా రక్షణ, ఇంధనం, వాణిజ్య సంబంధాలపై దృష్టి పెట్టనుంది. అజిత్ దోవల్, ఎస్. జైశంకర్ వంటి కీలక నేతల వరుస పర్యటనలు, భారతదేశం తన విదేశాంగ విధానంలో స్వతంత్రతను కాపాడుకోవడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలియజేస్తున్నాయి.

## మోదీ కోసం చేతితో రాఖీ తయారుచేసిన పాకిస్థాన్ సోదరి.. ఆహ్వానం కోసం ఎదురుచూపు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతి సంవత్సరం రక్షా బంధన్ రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాఖీ కట్టే కమర్ మోహ్సిన్ షేక్ ఈ ఏడాది చేతితో తయారు చేసిన రెండు ప్రత్యేక రాఖీలను సిద్ధం చేసి, ప్రధాని కార్యాలయం నుంచి ఆహ్వానం కోసం ఎదురుచూస్తున్నారు. పాకిస్థాన్‌లోని కరాచీలో జన్మించిన కమర్ మోహ్సిన్ షేక్ 1981లో వివాహం తర్వాత భారతదేశానికి వచ్చారు. గత 30 సంవత్సరాలకు పైగా ఆమె మోదీకి రాఖీ కడుతున్నారు. ఈ సంవత్సరం ఆమె ఓం, వినాయకుడి బొమ్మలతో రెండు రాఖీలు తయారు చేశారు. తాను ఎప్పుడూ మార్కెట్‌లో రాఖీలు కొననని, ప్రతి సంవత్సరం ఇంట్లోనే స్వయంగా తయారు చేసి, వాటిలో ఒకదాన్ని ప్రధాని మోదీ చేతికి కట్టడానికి ఎంపిక చేస్తానని ఆమె తెలిపారు. మూడు దశాబ్దాల అనుబంధం..రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లో మోదీ వలంటీర్‌గా ఉన్నప్పుడు ఆయనను మొదటిసారి కలుసుకున్నప్పటి జ్ఞాపకాలను కమర్ షేక్ పంచుకున్నారు. అప్పట్లో మోదీ ఆమెను పలకరించడం, ఆ చిన్న సంభాషణతోనే వారిద్దరి మధ్య ఒక సోదర బంధం మొదలయ్యిందని, అది మూడు దశాబ్దాలుగా కొనసాగుతోందని ఆమె చెప్పారు. అప్పటి నుంచి ఆమె ప్రతి సంవత్సరం మోదీ చేతికి రాఖీ కడుతున్నారు. ఒకసారి ఆమె మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుని ప్రార్థించగా, అది నిజమైంది. ఆ తర్వాత మోదీ ఆమెను తదుపరి దీవెన ఏమిటని అడిగినప్పుడు.. భారతదేశానికి ప్రధానమంత్రి కావాలని కోరుకున్నానని, తన కోరిక ఇప్పుడు నెరవేరిందని, మోదీ ప్రస్తుతం మూడవసారి

# తొక్కిసలాట ఘటన కేసులో కీలక పరిణామం



**హైదరాబాద్-నవభూమి:** పుష్ప మూవీ సంధ్య థియేటర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. పుష్ప పీవ్యూ షో ఘటనపై మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. విచారణలో కమిషన్ సీరియస్‌గా స్పందించింది. పుష్ప ఘటనకు సంబంధించి చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. పుష్ప ఘటనలో చనిపోయిన బాధితులకు 5 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అలాగే.. పుష్ప ఘటనలో పోలీస్‌ల వ్యవహారంపై కూడా నివేదిక సమర్పించాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది పుష్ప -2 మూవీ ప్రీమియర్ షోను ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్యా థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే అదే సమయంలో థియేటర్ వద్దకు హీరో అల్లు అర్జున్ రావడంతో ఆయనను చూడటానికి భారీగా అభిమానులు చేరారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో సినిమా చూడటానికి వచ్చిన రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై రేవతి కుటుంబానికి పుష్ప మూవీ టీమ్ పరిహారం అందజేసింది. అల్లు అర్జున్ అరెస్ట్ అయిన సంగతీ తెలి సిందే.. అయితే తీవ్రంగా గాయపడిన రేవతి కుమారుడు శ్రీతేజ్ చాలా రోజులు తరువాత హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. కాగా, శ్రీతేజ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు సమాచారం.

# హోంమంత్రిగా అమిత్‌షా సరికొత్త రికార్డు

**(1వపేజీ తరువాయి)** రాజకీయాల్లో, భద్రతా విధానాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చారు. అందులో ఒకటి ఆర్టిక్ 370 రద్దు కాగా మరో రెండు పౌరసత్వ సవరణ చట్టం, కొత్త క్రిమినల్ చట్టాలు. ఈ నిర్ణయాల వల్ల దేశంలోని పరిస్థితులు పూర్తిగా మారిపోయి.. బీజేపీ సర్కారు విజయానికి నాంది పలికింది. ఆర్టికల్ 370 రద్దు .. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ను రద్దు చేయడం ఆయన తీసుకున్న అత్యంత కీలక నిర్ణయాల్లో ఒకటి. దీనివల్ల జమ్మూ కశ్మీర్ పూర్తిగా భారతదేశంలో విలీనమై.. కేంద్రపాలిత ప్రాంతాలుగా మారాయి. ఇది భారతీయ జనతా పార్టీ యొక్క సుదీర్ఘకాల వాగ్దానాల్లో ఒకటి. ఈ నిర్ణయం దేశ సమగ్రతకు, భద్రతకు ఎంతో దోహదపడింది.

పౌరసత్వ సవరణ చట్టం వివాదాస్పదమైన పౌరసత్వ సవరణ చట్టం ను తీసుకురావడం మరో ముఖ్యమైన నిర్ణయం. ఈ చట్టం ప్రకారం, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలలో మతపరమైన వేధింపులకు గురైన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వం కల్పించడానికి అవకాశం లభించింది.

కొత్త క్రిమినల్ చట్టాలు.. వందల సంవత్సరాల పాటు భారతదేశంలో అమలులో ఉన్న భారత శిక్షా స్మృతి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకురావడం అమిత్ షా తీసుకున్న మరో ముఖ్యమైన నిర్ణయం. ఈ కొత్త చట్టాలు – భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లు.. 2024వ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. ఈ చట్టాలు మన కాలానికి, మన వ్యవస్థకు మరింత అనుగుణంగా ఉండేలా రూపొందించబడ్డాయి. పైన పేర్కొన్న నిర్ణయాలతో పాటు అమిత్ షా తన పదవీకాలంలో నక్సలిజంను అంతం చేయడానికి ఒక గడువును కూడా నిర్ణయించారు. ఈశాన్య రాష్ట్రాలలో శాంతిని నెలకొల్పడానికి వివిధ తిరుగుబాటు గ్రూపులతో 12 శాంతి ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ చర్యలు దేశ అంతర్గత భద్రతను బలోపేతం చేశాయి. అమిత్ షా నాయకత్వం ఒక వైపు బలమైన నిర్ణయాలతో.. మరో వైపు శాంతి స్థాపనతో కూడుకొని ఉండగా.. ఆయన పదవిలో ఇంతకాలం కొనసాగడానికి కారణం అయ్యాయి.

### మహిళలకు ఉచిత ప్రయాణం మార్గదర్శకాలు

# కేబినెట్‌లో కీలక నిర్ణయాలు


**(1వపేజీ తరువాయి)** ఏపీ మంత్రివర్గం కీలక భేటీ కొనసాగుతోంది. పలు అంశాలకు కేబినెట్ ఆమోద ముద్ర వేయనుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంది. ఈ పథకానికి మార్గ దర్శకాలు ఖరారయ్యాయి. కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అమరావతి రెండో విడత భూ సమీకరణ పైన నిర్ణయం తీసుకోనున్నారు. అదే విధంగా సంస్థలకు భూముల కేటాయింపు నిర్ణయాలకు ఆమోద ముద్ర తో పాటుగా మంత్రులతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. %ూశ్రీంశీ =ఖుం% అందుకే నష్టపోయాం, ఇక - చంద్రబాబు కీలక ఆదేశాలు..!! ఉచిత ప్రయాణం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మార్గదర్శకాలు ఖరారయ్యాయి. రాష్ట్ర పరిధిలో ఏపీ మహిళ లకు ఈ పథకం అమలు కానుంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి అయినా ఆర్టీసీ బస్సుల్లో ఈ పథకం అమలుకు నిర్ణయించారు. విద్యార్థినులు ప్రత్యేకంగా పాస్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే విధంగా ఏపీ పరిధిలో ఉంటున్నట్లుగా ఏదైనా గుర్తింపు పొందిన కార్డు ద్వారా ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. జీరో టికెటింగ్ విధానం ద్వారా ఈ పథకం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, అల్ట్రా ఎక్స్ ప్రెస్‌లలో కూడా ఈ పథకం అమలులో ఉండనుంది. ఈ నెల 9న రాఖీ పూర్ణిమ నాడు పథకం అమలు పైన ప్రభుత్వం ప్రకటన చేయనుంది.. 15వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. కొత్తగా హోటళ్లు అదే విధంగా అలాగే 22 ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ హోటళ్లు, ఆరు క్లస్టర్ల పరిధిలోని రిసార్టుల ఆపరేషన్లకు సంబంధించి ఏజెన్సీల ఎంపికకు వీసీ అండ్ ఎండీకి అనుమతులు మంజూరు చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం పేరూరు లో 25 ఎకరాల భూమికి బదులుగా గతంలో ఓబెరాయ్ హోటళ్ల గ్రూపు నిర్మాణానికి ఇచ్చిన టీటీడీ ల్యాండ్ బదిలీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎస్‌బీఐ, యూబీఐ బ్యాంకులకు రూ.900 కోట్లు గ్యారెంటీని పవర్ సెక్టార్‌కు ఇస్తూ తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. పథకాలు అమలు వీటితో పాటుగా హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచే అంశంపై మంత్రిమండలిలో ఓ నిర్ణయం తీసుకోనున్నారు. ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్‌లకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వరసగా రూ.3,545 కోట్లు, రూ.1029 కోట్లు మంజూరు చేసిన రుణానికి గానూ ప్రభుత్వ గ్యారెంటీపై కేబినెట్ చర్చించనుంది. పాఠశాల విద్యలో పలు జీవోలకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. కాంప్రీహెన్సివ్ ఏపీ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025కు కేబినెట్‌లో ఆమోదం తెలిపే అవకాశం ఉంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్టు) దాని అనుబంధ సంస్థలు, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్‌లపై మరో ఏడాదిపాటు నిషేధం పొడిగిస్తూ మంత్రిమండలి ఓ నిర్ణయం తీసుకోనే అవకాశం ఉంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలో మోదీ వ్యూహం

### ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేరు తెరపైకి

**(1వపేజీ తరువాయి)** అనూహ్యంగా దక్షిణాదికే ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. అందులోను మైనార్టీ వర్గానికి ఈ పదవి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఇందుకోసం ఏపీలో కీలక పదవిలో ఉన్న వ్యక్తికి ప్రమోషన్ ఖాయమని సమాచారం. తెరపైకి ఏపీ గవర్నర్ పేరు ధన్‌కర్ రాజీనామాతో కొత్త ఉపరాష్ట్రపతి ఎంపికపైన క్రమేణా స్పష్టత వస్తోంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బీజేపీ క్యాంపులో ఈ ఎన్నికపైన వ్యూహాత్మక కసరత్తు జరుగుతోంది. తొలుత ఈ పదవికి బీహార్ నుంచి ఎంపిక చేస్తారని ప్రచారం జరిగింది. పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. మిత్రపక్షంగా ఉన్న నితీష్ కుమార్ పార్టీకి ఈ పదవి ఇస్తారని ఊహాగానాలు వినిపించాయి. అయితే మారుతున్న సమీకరణాలతో మోదీ టీం కొత్త వ్యూహం అమలుకు సిద్ధమైంది. అందులో భాగంగా దక్షిణాది నేతకు ఉపరాష్ట్రపతి ఇవ్వాలని దాదాపు నిర్ణయానికి వచ్చేశారు. అందునా మైనార్టీ వర్గానికి ఈ పదవి ఇవ్వడం ద్వారా ఇండియా బ్లాక్‌ను డిఫెన్స్‌లోకి నెట్టాలనేది మోదీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇందుకోసం అనూహ్యంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేరు తెరమీదకు వచ్చింది. 2023లో ఏపీ గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ కర్నాటక రాష్ట్రానికి చెందిన నజీర్ సుదీర్ఘకాలం న్యాయమూర్తిగా పనిచేశారు. సుప్రీంకోర్టులో ఎక్కువకాలం పనిచేసిన నజీర్ అయోధ్య తీర్పులోను భాగస్వామిగా ఉన్నారు. 2023 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. రెండున్నరేళ్ల గవర్నర్ పదవీకాలం పూర్తి చేసిన అబ్దుల్ నజీర్‌ను ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేయడంపైన మోదీ క్యాంప్ కసరత్తు చేస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రపతిగా గిరిజన మహిళ ఉండటంతో దక్షిణాదికి చెందిన మైనార్టీ వర్గానికి ఉపరాష్ట్రపతి కేటాయించడం ద్వారా ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకూడదన్నది మోదీ వ్యూహంగా ఉంది. మారుతున్న సమీకరణాల నేపథ్యంలో బీహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల ముందు మైనార్టీ వర్గానికి ఉపరాష్ట్రపతి పదవి నిర్ణయం రాజకీయంగా కలిసి వస్తుందని ఢిల్లీ నాయకత్వం అంచనా వేస్తోంది. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ప్రస్తుతం ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్ కంటిన్యూ కానున్నారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి తమిళనాడు లేదా పశ్చిమబెంగాల్‌కు దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్డీయేకు ఎలక్టరోల్ కాలేజీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి గెలిచేందుకు అవసరమైన పూర్తి మెజార్టీ ఉంది. ఇప్పుడు తమ అభ్యర్థి విషయంలో అమలు చేసిన సమీకరణాలతో పాటుగా ఇండియా కూటమి పోటీకి అవకాశం లేకుండా చేయాలనేది మోదీ స్ట్రాటజీ. అబ్దుల్ నజీర్ పేరు ఖరారు అయితే హమీద్ అన్సారీ తర్వాత మైనార్టీ వర్గానికి చెందిన మరొకరు ఉపరాష్ట్రపతి కానున్నారు. అదే కాకుండా కర్నాటక,ఏపీ రాష్ట్రాలతో సంబంధమున్న వెంకయ్యనాయుడు తరహాలోనే అబ్దుల్ నజీర్ చరిత్రలో నిలవనున్నారు. ఈ ఎంపికపైన మరో రెండ్రోజుల్లో స్పష్టత రానుంది.

# బీఆర్ఎస్‌పై బాలరాజు సంచలన వ్యాఖ్యలు



**నాగర్ కర్నూలు,-నవభూమి ప్రతినిధి:** బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. ఆ పార్టీపై సంచలన వ్యాఖలు చేశారు. బుధవారం నాగర్ కర్నూలులో గువ్వల బాలరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. అసమర్థ నాయకత్వం కుట్రలు చేసి తనను ఓడించిందంటూ బీఆర్ఎస్ పార్టీపై మండిపడ్డారు. అన్యాయాన్ని ఎదిరించే పాత్రను ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ పోషించడం లేదన్ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు కష్ట కాలంలో పార్టీ అది నాయకత్వం అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అది చేయకుండా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం చేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జీబీఆర్ ( గువ్వల బాలరాజు) రూ. 100 కోట్లకు అమ్ముడు పోలేదని స్పష్టం చేశారు. గువ్వల బాలరాజు అంటేనే ఒక సెన్సేషన్..జీబీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడకూడదంటే ఒప్పుకోడంటూ తన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కుండ బద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఏం ఆదేశిస్తే అదే తాను చేశానని చెప్పుకొచ్చారు. పేదరిక నిర్మూలన.. ప్రజల పక్షమే తన పంతమని పేర్కొన్నారు. తనకు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అది నాయకత్వం నుంచి పిలుపు వచ్చిందన్నారు. కానీ తన వాయిస్ ప్రజల పక్షాన బతికి ఉండాలంటే.. స్వేచ్ఛ ఉన్న పార్టీ తనకు కావాలని పేర్కొన్నారు.

## ఏఐఉద్యోగాలను తొలగించదు.. పెంచుతుంది

**(1వపేజీ తరువాయి)** అందులో ఒకటి ప్రాంప్ట్ ఇంజనీర్, రెండోది ఏఐ ప్రొడక్ట్ మేనేజర్, మూడోది ఏఐ ఎథిక్స్ స్పెషలిస్ట్ అని తెలిపారు. అలాగే కార్యాలయాలు నేటిలా కాకుండా వాటి రూపురేఖలే పూర్తిగా మారిపోయే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని.. అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోయెంకా చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ కావడంతో.. అనేక మంది స్పందిస్తున్నారు. తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు. చాలా మంది నెటిజన్లు ఏఐ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక నెటిజన్.. "ఏఐ ఉద్యోగాలను తగ్గిస్తుందని భయపడటం సరికాదు, అది కొత్త మార్గాలను తెరుస్తుంది" అని పేర్కొన్నారు. మరొకరు ఏఐ వల్ల అన్ని రంగాల్లో ఉత్పాదకత పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అభిప్రాయపడ్డారు. వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా లాంటి ప్రముఖులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ ట్యూటర్ల రాకతో సాంప్రదాయ కాలేజ్ డిగ్రీలకు ప్రాముఖ్యత తగ్గుతుందని.. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా విద్య లభిస్తుందని ఆయన అంచనా వేశారు. మొత్తానికి భవిష్యత్ పని ప్రపంచంలో విజయం సాధించాలంటే %ూ×%కి అనుగుణంగా మారడం మరియు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యంత అవసరం అని ఈ అభిప్రాయాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఏపీ ప్రభుత్వం మరో ఉచిత హామీ పథకం.. నేటి నుంచే అమలు

**(1వపేజీ తరువాయి)** అందించనున్నట్లు ప్రకటించారు. నేతన్నల కోసం ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం నుంచి నిర్ణయాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చేపట్టాల్సిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేలా సమీక్షలో నిర్ణయం వెల్లడించారు. సీఎం ఆదేశాలు ఇక, హ్యాండ్లూమ్ వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని చంద్రబాబు ప్రకటించారు. ఈ నిర్ణయాల వల్ల చేనేత రంగం పుంజుకుంటుందని తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చేనేత కార్మికుల కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం నుంచి ఈ నిర్ణయాలను అమలు చేయాలని చంద్రబాబు నిర్దేశించారు. ఏపీకి చెందిన చేనేత ఉత్పత్తులకు లభించిన 10 జాతీయ అవార్డులను అధికారులు సీఎం చంద్రబాబుకు నిర్దేశించారు. పవర్ లూమ్స్‌కు 500, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్ల వరకు ఇవ్వనుంది. ఈ మేరకు రూ. 125 కోట్లు ఖర్చు కానుంది. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఈ నెల 7వ తేదీ (జాతీయ చేనేత దినోత్సవం) నుంచి అమలు చేయాల్సిన కార్యక్రమాలపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నేడు సమీక్ష నిర్వహించారు. 1.చేతి మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ 2.ఎన్నికల హామీ 5, 2025 నిబంధనలు ప్రభుత్వ నిర్ణయం ద్వారా 50,000ల మగ్గాలు, 15,000ల మర మగ్గాలు కలిగిన కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 93,000ల చేనేత కుటుంబాలకు లబ్ధి కలగనుంది. సర్కార్ అనుమతించిన కరెంట్ కన్నా ఎక్కువ వినియోగించిన లబ్ధిదారుల రాయితీ మొత్తాన్ని కోల్పోకుండా ప్రత్యేక నిబంధన తీసుకొచ్చింది. తాజా నిర్ణయం మేరకు చేనేత కుటుంబాలు 200 యూనిట్ల కంటే అదనంగా వినియోగిస్తే 200 యూనిట్ల వరకు బిల్లును సర్కార్ భరిస్తుంది. అదనంగా వినియోగించిన యూనిట్లకు మాత్రం డిస్కంల టారిఫ్ మేరకు ఛార్జీలను వినియోగదారులే చెల్లించాలి. పవర్‌లూమ్స్‌కూ 500 యూనిట్లు దాటితే ఇదే నిబంధన వర్తిస్తుంది. అదేవిధంగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు పింఛన్? సదుపాయాన్ని కల్పిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీ మేరకు రూ.4000లు అందిస్తోంది.

## బీసీలకు బీజేపీ పంగనామం.. మంత్రి సీతక్క ఫైర్


**(1వపేజీ తరువాయి)** గల్లీలలో మెప్పు కోసం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లులకు సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, అయితే అదే బీజేపీ ఎంపీలకు ఢిల్లీలో ఆ బిల్లులను ఆమోదింపజేసే బాధ్యత లేదా అని సీతక్క ప్రశ్నించారు. అసెంబ్లీలో మద్దతు ఇవ్వడం అనేది కేవలం గల్లీ రాజకీయాల కోసమేనని, వారికి బీసీల ఆత్మగౌరవం, హక్కులు పట్టవని ఆమె అన్నారు. ఓట్ల కోసం కులాల మధ్య, వర్గాల మధ్య విభజన చేయడం తప్ప, సామాజిక న్యాయం కోసం బీజేపీ ఎప్పుడూ పని చేయదని సీతక్క ఆరోపించారు. మోదీ పుట్టిన గుజరాత్‌లో, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో కూడా ముస్లింలు బీసీలుగా పరిగణింపబడుతున్నారని, ఇది కొత్త విషయం కాదని ఆమె స్పష్టం చేశారు. తరతరాలుగా వెనుకబడిన ముస్లింలను బీసీలుగా పరిగణిస్తున్నాం తప్ప, కొత్తగా ఏ ముస్లిం వర్గాన్ని చేర్చలేదు లేదా తీసివేయలేదని ఆమె అన్నారు. మోదీ పేరికే బీసీ అని, ఆయన డీఎన్ఏలో బీసీ వ్యతిరేక భావజాలం ఉందని సీతక్క విమర్శించారు. ఆయన పీఎంఓలో బీసీలు, అట్టడుగు వర్గాలకు చెందిన అధికారులు లేరని ఆమె పేర్కొన్నారు. ఐఐటీ, ఐఐఎంలలో రిజర్వేషన్లు కావాలని అడిగినప్పుడు, క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు రిజర్వేషన్ పనికి రాదని చెప్పారని ఆమె గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం ఆవశ్యకత సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో బీసీలకు కులవృత్తులపై కూడా ఆధారపడే పరిస్థితి లేదని సీతక్క తెలిపారు. అందుకే జనాభా, వెనుకబాటు ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. లేకపోతే బీజేపీని ఊర్లలోకి రాకుండా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు బీసీ బిల్లును పాస్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ వాకింగ్ స్టైల్ కి ఉన్న క్రేజ్ అలాంటిదిరేవంత్ వెనుక ఆంధ్రా పెట్టుబడిదారులు.. కోమటిరెడ్డి సంచలన ఆరోపణలు రాహుల్ గాంధీపై ప్రశంసలు రాహుల్ గాంధీని యుగ పురుషుడు అని అభివర్ణిస్తూ, బీసీలకు రిజర్వేషన్లు పెరగాలని ఆయన పాదయాత్ర చేశారని సీతక్క ప్రశంసించారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవం బీజేపీకి పట్టవని ఆమె అన్నారు.

## తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి

**(1వపేజీ తరువాయి)** కూడిన ధర్మాసనం స్పందిస్తూ, తొలగించిన ఓటర్ల జాబితా వివరాలు ఇప్పటికే రాజకీయ పార్టీలకు ఇచ్చినందున ఆ వివరాలను ఎన్‌జీవోకు కూడా అందించాలని ఈసీ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం జాబితా వివరాలను అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వివరిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
గురువారం
07 । ఆగస్టు । 2025


# ఆ ఓటర్ల వివరాలు వెల్లడించండి: ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు





**న్యూఢిల్లీ-నవభూమి:** సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే డిలీట్ చేసిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టుఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ సిర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. %జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఓ కాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారం లోగా రిప్లై నమోదు చేయాలని, ఏడీఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏ విషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. డిలీటైన 65 లక్షల ఓటర్లు మరణించార లేక శాశ్వతంగా ఇండ్లు మారారా.. అన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఏడీఆర్ తన అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.

## పార్లమెంట్‌లో బీహార్ సిర్‌పై చర్చించలేం: మంత్రి రిజిజు




**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని పార్లమెంట్‌లో విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడం అంటే, అన్ని నియమాలను ఉల్లంఘించినట్లు అవుతుందని ఆయన అన్నారు. సభ సజావుగా సాగేందుకు విపక్ష ఎంపీలు సహకరిచాలని ఆయన కోరారు. సభా కార్యక్రమాను అడ్డుకోరాదన్నారు. మనం చర్చించడం కోసం చాలా ముఖ్యమైన విషయాలు ఉన్నాయని, జాతీయ క్రీడా విధాన్ని తామేమీ ప్రవేశపెట్టడంలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అనేది వ్యక్తిగత వ్యవస్థ అని, సుప్రీంకోర్టులో ఆ కేసు ఉందని, ఆ అంశాలను పార్లమెంట్‌లో డిస్కస్ చేయలేమని మంత్రి రిజిజు తెలిపారు.

విపక్ష సభ్యుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. ప్రతి ఒక్కరు ఒకే రకమైన రూల్స్ పాటించాలన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడిగినందుకు సరైన రీతిలో వ్యవహరించడం లేదని ఖర్గే అన్నారు. సభలో గందరగోళం సృష్టిస్తున్నవారికి సభలో మాట్లాడే హక్కులేదని జేపీ నడ్డా తెలిపారు. అయినా కానీ బీహార్ సిర్ ప్రక్రియపై చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

మీ ఇంటి గుమ్మం వద్దకే గంగా నది వచ్చిందన్న మంత్రి.. మీరే ఆశీర్వాదం తీసుకోవాలన్న మహిళ %ఖుఅయిఎ చీఅంష్ణుఁస% ఎ వరదలు ముంచెత్తిన ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. మీ ఇంటి వద్దకే గంగా నది వచ్చిందని, పాదాలు శుద్ధి చేసిందని ఒక మహిళతో ఆయన అన్నారు. మిమ్మల్ని నేరుగా స్వర్గానికి తీసుకెళ్తుందని వ్యాఖ్యానించారు. అయితే 'గంగా ఆశీర్వాదం మీరే తీసుకోండి' అని ఆ మహిళ బదులిచ్చింది.

# సంక్షేమ పథకాల్లో సీఎం ఫోటో, పేరు వాడొచ్చు..: సుప్రీంకోర్టు సంచలనం



**చెన్నై-నవభూమి:** తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. రాష్ట్ర సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి పేరును, ఫోటోలను వాడకుండా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో పథకాల ప్రచారంలో తమ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పేరు, ఫోటోలను యథావిధిగా ఉపయోగించుకోవడానికి డీఎంకే ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వు కేవలం అనవసరం మాత్రమే కాదని.. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అ కీలక వ్యాఖ్యలు చేసింది. అంతేకాకుండా ఈ పిటిషన్‌ను దాఖలు చేసిన ఏఐఏడీఎంకే నాయకుడు సి.వి.షణ్ముగంకు సుప్రీం కోర్టు పది లక్షల రూపాయల జరిమానా కూడా విధించింది. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే.. తమిళనాడులో అమలు చేస్తున్న 'ఉంగళుడన్ స్టాలిన్' (మీతో స్టాలిన్) అనే పథకానికి వ్యతిరేకంగా సి.వి.షణ్ముగం మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు. పథకాలకు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి పేరు పెట్టడం, ఆ పథకాల ప్రచార ప్రకటనలలో వారి ఫోటోలను ఉపయోగించడం ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడమేనని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు.. సంక్షేమ పథకాలలో ప్రస్తుత ముఖ్యమంత్రి మాజీ ముఖ్యమంత్రుల పేర్లను, ఫోటోలను వాడకూడదని జూలై 31న ఒక మధ్యంతర ఉత్తర్వును జారీ చేసింది. అంతేకాకుండా పార్టీ గుర్తు లేదా జెండాను కూడా పథకాల ప్రచారంలో ఉపయోగించకుండా నిషేధించింది.

అయితే ఈ తీర్పు సంక్షేమ పథకాల అమలును నిలిపివేయడానికి కాదని.. కేవలం వాటి ప్రచారంలో ఉండే పేరు, కంటెంట్‌కు మాత్రమే పరిమితమని హైకోర్టు స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలపై డీఎంకే ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. ఈక్రమంలోనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన ఈ బెంచ్.. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పథకాలకు నాయకుల పేరు, ఫోటోలు పెట్టడంపై ఆంక్షలు విధించడం చట్టబద్ధమైన పరిధిలో లేదని.. ఈ అంశంపై హైకోర్టు జోక్యం చేసుకోవడం సరైనది కాదని స్పష్టం చేసింది. ఇలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి వేరే మార్గాలు ఉన్నాయని, ప్రజల సొమ్ము దుర్వినియోగం అయితే దానికి చట్టపరమైన పరిష్కారాలు వేరుగా ఉంటాయని పేర్కొంది. అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రుల పేర్లు, ఫోటోలు ఉంటున్నాయని గుర్తు చేసింది. ఈక్రమంలోనే మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేసింది. పథకాలకు పేరు పెట్టడం, ప్రచారం చేసుకోవడం ప్రభుత్వ నిర్ణయాధికారమని.. దాన్ని కోర్టులు నిలిపివేయడం సరికాదని స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్ పారదర్శకత లేనిదని, న్యాయ ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని పేర్కొంటూ పిటిషనర్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. దీంతో డీఎంకే ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రచారంలో తమ ముఖ్యమంత్రి పేరు ఫోటోలను ఉపయోగించుకోవడానికి తిరిగి అనుమతి లభించింది.

## మీ ఇంటి గుమ్మం వద్దకే గంగా నది వచ్చిందన్న మంత్రి.. మీరే ఆశీర్వాదం తీసుకోవాలన్న మహిళ



**లక్నో-నవభూమి:** వరదలు ముంచెత్తిన ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. మీ ఇంటి వద్దకే గంగా నది వచ్చిందని, పాదాలు శుద్ధి చేసిందని ఒక మహిళతో ఆయన అన్నారు. మిమ్మల్ని నేరుగా స్వర్గానికి తీసుకెళ్తుందని వ్యాఖ్యానించారు. అయితే 'గంగా ఆశీర్వాదం మీరే తీసుకోండి' అని ఆ మహిళ బదులిచ్చింది. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గంగా, యమునా నదులు పొంగి ప్రవహించాయి. ఈ నేపథ్యంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, వారణాసితో సహా పలు జిల్లాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది.

కాగా, బీజేపీ మిత్రపక్షమైన నిషాద్ పార్టీ అధినేత, మత్స్యశాఖ మంత్రి సంజయ్ నిషాద్ సోమవారం కాన్పూర్ దేహత్‌లోని వరద ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించారు. వరద నీటిలో నిల్చొన్న స్థానిక మహిళతో ఆయన మాట్లాడారు. 'మీ పాదాలు శుభ్రం చేసుకునేందుకు గంగా నది మీ ఇంటి మెట్ల వద్దకు చేరుకున్నది. ఇది మిమ్మల్ని నేరుగా స్వర్గానికి తీసుకెళ్తుంది' అని అన్నారు. దీంతో 'గంగా ఆశీర్వాదం మీరే పొందండి' అని ఆ మహిళ అన్నది. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మంత్రి సంజయ్ నిషాద్ వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. వరదల వల్ల ప్రభావితమైన ప్రజల దుస్థితిని ఆయన చాలా తేలికగా తీసుకున్నారని ఎస్పీ నేత విమర్శించారు.


## ఉత్తర కాశీలో క్లౌడ్ బరస్ట్.. 12 మృతదేహాలు లభ్యం



**ఉత్తర కాశీ-నవభూమి:** ఉత్తర భారతదేశంలో కురుస్తోన్న కుండపోత వానలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. తాజాగా ఒక్కసారిగా విరుచుకుపడిన వరదల ధాటికి ఉత్తర కాశీలో ఓ గ్రామమే తుడిచిపెట్టుకుపోయిందంటే.. పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు. సుమారు 70 మంది వరకు వరదల్లో చిక్కుపోయి ఉంటారని భావిస్తున్నారు. ఈ వరదల్లో ధరాళీ గ్రామం తుడిచిపెట్టుకుపోగా.. నలుగురు మృతి చెందారు.. శిథిలాల కింద మరో 12 మంది దాకా ఉన్నట్లు సమాచారం. ఈ పెను ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. వరద బీభత్సానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు..ఉన్నట్లుండి విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలతో.. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ ప్రాంతం గజగజ వణికిపోయింది. వరదల ధాటికి గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న ధరాళీ గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఇక్కడ సగానికి పైగా నివాస భవనాలు, హోటళ్లు వరదలో మునిగిపోగా.. కొన్ని ప్రాంతాల్లో కార్లు, ఇళ్లు, చెట్లు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. ఆకస్మాత్తుగా ముంచెత్తిన వరదల్లో నలుగురు చనిపోగా.. 60-70 మంది వరకు వరదల్లో చిక్కుకుపోయినట్లు సమాచారం. శిథిలాల కింద మరో మరో 12 మందిదాకా ఉంటారని భావిస్తున్నారు. ఇప్పటి వరకు సహాయక బృందాలు 12 మంది మృతదేహాలను వెలికి తీశాయి. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఈ వరదల్లో హర్షిల్‌లోని సైనిక శిబిరం కొట్టుకుపోయి.. 10 మందికిపైగా జవాన్లు గల్లంతైనట్టు సైనిక వర్గాలు వెల్లడించాయి. మంగళవారం ఖీర్ గంగా నది పరీవాహక ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ చోటు చేసుకోవడంతో పైనుంచి ఒక్కసారిగా విరుచుకుపడ్డ బురదతో కూడిన వరద.. కింద ప్రాంతంలోని ధరాళీ గ్రామం వైపుకు దూసుకొచ్చింది. వరద ధాటికి 3, 4 అంతస్తుల భవనాలు సైతం పేక మేడల్లా కూప్పకూలిపోయి.. కొట్టుకుపోయాయి. వరద తాకిడికి గ్రామంలో 20-25 హొటళ్లు, హొంస్టేలు కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. ధరాళీ గ్రామం నుంచి కిందకు దూసుకుపోయిన వరద సుక్కీ గ్రామాన్నీ ముంచెత్తింది. మంగళవారం నాడు ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వరదల్లో గల్లైంతన వారి గురించి ఇంకా పూర్తి స్థాయిలో కచ్చితమైన సమాచారం లేదని అధికారులు అంటున్నారు.

వరద ధరాళీ గ్రామాన్నిముంచెత్తిన విషయం తెలుసుకున్న వెంటనే సమీపంలోని హర్సిల్‌లో ఉన్న సైనిక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం హెలికాప్టర్ వెళ్లడానికి వాతావరణం సహకరించడం లేదని అధికారులు తెలిపారు. ఈ ఆకస్మిక వరదలపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరదల్లో మరణించిన వారికి సంతాపం తెలిపారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సీఎం పుష్కర్‌సింగ్ ధామికి ఫోన్‌లో సూచించారు. సహాయక చర్యల కోసం 150 మంది సైనికులను సంఘటనా స్థలానికి పంపినట్లు ఆర్మీ వెల్లడించింది.

## రాహుల్ గాంధీకి బెయిల్ ఇచ్చిన జార్కండ్ కోర్టు



**రాంచీ-నవభూమి:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరీ చేసింది జార్కండ్ కోర్టు. 2018లో కేంద్ర మంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఇవాళ కోర్టు ముందు రాహుల్ గాంధీ హాజరయ్యారు. జార?ండ్‌లోని వెస్ట్ సింగభుమ్ జిల్లాలో ఉన్న చైబాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. ఇవాళ ఉదయం 10.55 నిమిషాలకు ఆయన కోర్టుకు వెళ్లారు. కేంద్ర మంత్రి షాపై వ్యాఖ్యలు చేసిన ఘటనలో ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి కేసు బుక్ చేశారు.

వాస్తవానికి రాహుల్ గాంధీ జార్కండ్‌లో ఇవాళ శిబూ సోరెన్ అంత్యక్రియల్లో పాల్గొనాల్సి ఉంది. రాంచీకి చేరుకున్న తర్వాత ఆయన వెళ్లాల్సిన హెలికాప్టర్ మొరాయించింది. దీంతో శిబూ సోరెన్ అంత్యక్రియలకు వెళ్లలేకపోయారు. కేంద్ర మంత్రి షాను అవమానించే రీతిలో రాహుల్ వ్యాఖ్యలు చేసినట్లు తన ఫిర్యాదులో ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కేసులో జూన్ 26వ తేదీన హాజరుకావాలని స్పెషల్‌కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే జార్కండ్ హైకోర్టులో అభ్యర్థన చేయడంతో కేసును ఆగస్టు 6వ తేదీకి బదిలీ చేశారు.

## ఉరేసుకుని ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య




**ముంబై-నవభూమి:** ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని తన హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం రాత్రి పుణెలో చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన ఓ విద్యార్థిని రెండేండ్ల క్రితం బీజే మెడికల్ ప్రభుత్వ కాలేజీలో చేరారు. ప్రస్తుతం ఆమె సెకండియర్ చదువుతున్నారు. ఉన్నట్టుండి మంగళవారం రాత్రి తను ఉంటున్న హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె ఉరేసుకున్న విషయాన్ని గమనించిన తోటి విద్యార్థినులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు డెడ్‌బాడీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎంబీబీఎస్ విద్యార్థిని ఉరేసుకున్న గదిలో సూసైడ్ నోట్ లభించింది. స్కూల్ డేస్ నుంచి తాను సైక్రియాటిక్ ట్రీట్‌మెంట్ పొందుతున్నట్లు పేర్కొన్నారు. చదువుకోవాలనే ఆశ ఉందని సూసైడ్ నోట్‌లో ఆమె పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్య విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు పోలీసులు చేరవేశారు.

## లైంగిక వేధింపుల కేసును కొట్టివేయండి.. కర్ణాటక హైకోర్టులో హెచ్‌డీ రేవణ్ణ పిటిషన్

**హసన్-నవభూమి:** జేడీయూ ఎంపీ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ ను లైంగిక వేధింపుల కేసు నుంచి బయటపడేసేందుకు అతడి తండ్రి, జేడీయూ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. తన కుమారుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలంటూ కర్ణాటక హైకోర్టు లో పిటిషన్ వేశాడు.

పని మనిషిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో హసన్ జిల్లాలోని హొలెనరసిపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. దాంతోపాటు అతడిపై మరో మూడు లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదయ్యాయి. వాటిలో ఒక కేసులో ఇటీవల ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్‌ను దోషిగా తేల్చింది. అతడికి జీవితఖైదు కూడా విధించింది. ఈ నేపథ్యంలో హొలెనరసిపుర పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని హెచ్‌డీ రేవణ్ణ హైకోర్టును ఆశ్రయించారు.

## పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించిందా.. ఇండియన్ ఆర్మీ



**పహల్గాం-నవభూమి:** ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత.. దాయాది దేశం పాకిస్తాన్ తొలిసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ వార్తలు వచ్చాయి. మంగళవారం సాయంత్రం.. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్ సమీపంలోని నియంత్రణ రేఖ వెంబడి.. పాక్ సైనికులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని.. భారత సైనిక పోస్ట్‌లపై పాక్ రేంజర్లు కాల్పులకు ఒడిగట్టారని.. దీంతో అప్రమత్తమైన భారత బలగాలు.. దాయాది సైన్యం చర్యలని సమర్థవంతంగా తిప్పి కొట్టాయి అని.. ఇరు సైన్యాల మధ్య 15 నిమిషాల పాటు కాల్పులు కొనసాగినట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. మరి నిజంగానే పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందా.. దీనిపై ఇండియన్ ఆర్మీ ఏమన్నదంటే..పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించదంటూ జరుగుతున్న ప్రచారంపై ఇండియన్ ఆర్మీ స్పందించింది. అలాంటిదేం జరగలేదని సైన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'పూంచ్ సెక్టార్ ప్రాంతంలో కాల్పుల విరమణ ఉల్లంఘన జరిగిందంటూ.. మీడియా, సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఇది అవాస్తవం. నియంత్రణ రేఖ వెంబడి ఎటువంటి కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదు. దయచేసి ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకండి' అంటూ ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో.. మే 10న ఇరు దేశాల మధ్య ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. భారత్ మే నెలలో ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి.. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. అయితే భారత్ దాడులకు ప్రతిగా.. పాకిస్తాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే భారత్ ధాటికి నిలబడలేకపోయిన పాకిస్తాన్.. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని ఇండియా అందుకు అంగీకరించింది. దీంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ వ్యవహారంలో సైన్యంలోని డీజీఎంవో స్థాయి అధికారులు కీలకంగా వ్యవహరించారు. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ.. ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది. ఏవైనా రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినప్పుడు ముందుగా డీజీఎంవో స్థాయి అధికారుల మధ్యే చర్చలు కొనసాగుతాయి. వీరు ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడంతో పాటుగా.. వారి ఉద్దేశాలను వివరించడం.. అవసరమైన వాటిని వెంటనే పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంట పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఆ సమయంలో భారత్-పాక్ డీజీఎంవోలు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారని వార్తలు వచ్చాయి.

## ఎంపీలకు రిసెప్షన్ డిన్నర్ ఇచ్చిన మహువా, పినాకి జంట.. ఫొటోలు వైరల్



**కోల్‌కత్తా-నవభూమి:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్ర బీజేడీ మాజీ ఎంపీ పినాకీ మిశ్రా వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మే 30న జర్మనీలోని బెర్లిన్‌లో రహస్యంగా పెళ్లి చేసుకుని అందరికీ షాక్ ఇచ్చారు. అయితే, పెళ్లైన రెండు నెలల తర్వాత ఎంపీలకు ఈ జంట రిసెప్షన్ డిన్నర్ ఇచ్చారు. మంగళవారం రాత్రి దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హొటల్‌లో మహువా, పినాకి జంట రిసెప్షన్ జరిగింది. ఈ రిసెప్షన్‌కు పలువురు ఎంపీలు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, రజీత్ రంజన్, అఖిలేష్ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సుప్రియో సూలే, శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక ఛతుర్వేది సహా పలువురు ఎంపీలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా, పశ్చిమబెంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర, ఒడిశాకు చెందిన మాజీ ఎంపీ పినాకి మిశ్రా, మే 30న జర్మనీలోని బెర్లిన్‌లో చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకున్నారు. మహువా మొయిత్ర ఈ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ప్రేమ, శుభాకాంక్షలు తెలియజేసిన అందరికీ చాలా కృతజ్ఞతతో ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ఆ ఫొటోల్లో మహువా సంప్రదాయ వస్త్రాలు ధరించి, బంగారు ఆభరణాలు ధరించినట్లు కనిపిస్తున్న ఫొటోను ప్రదర్శించింది. మహువా పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. పినాకీ మిశ్రా 1996లో కాంగ్రెస్ తరఫున, 2009, 2014, 2019లలో బీజేడీ తరఫున ఎంపీగా పోటీ చేసి గెలిచారు.

## అదుపుతప్పి నదిలో పడిపోయిన కారు.. ముగ్గురు మృతి




**చిర్గావ్-నవభూమి:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళు తున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి పబ్బర్ నది లోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ థాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగా గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తండ్రీ, కొడుకుల మధ్య గొడవ.. జోక్యం చేసుకున్న పోలీస్ అధికారిని నరికి చంపారు



**చెన్నై-నవభూమి:** తండ్రీ, ఇద్దరు కొడుకుల మధ్య గొడవ జరిగింది. వారు కొట్టుకుంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఒక పోలీస్ అధికారి అక్కడకు చేరుకున్నారు. తండ్రీ, కొడుకుల గొడవలో జోక్యం చేసుకున్నారు. అయితే ఆ ముగ్గురు కలిసి కొడవలితో ఆయనపై దాడి చేసి నరికి చంపారు. తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఈ షాకింగ్ సంఘటన జరిగింది. ఉడుమల్‌పేట సమీపంలోని కుడిమంగళంలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేకు చెందిన ప్రైవేట్ ఎస్టేట్ ఉన్నది. మూర్తి, అతడి ఇద్దరు కుమారులైన తంగపాండియన్, మణికంఠన్ అక్కడ పని చేస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి మద్యం సేవించిన తండ్రీ కొడుకులు ఘర్షణపడ్డారు. వారు తీవ్రంగా కొట్టుకోవడంతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాత్రివేళ గస్తీ విధుల్లో ఉన్న ఎస్ఎస్ఐ షణ్ముగవేల్ పోలీస్ వాహనంలో అక్కడకు చేరుకున్నారు. తండ్రీ, కుమారుల మధ్య ఘర్షణను నివారించడానికి ఆయన జోక్యం చేసుకున్నారు. గాయపడిన తండ్రి మూర్తిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఏర్పాటు కోసం ప్రయత్నించారు. మరోవైపు మూర్తి పెద్ద కుమారుడు తంగపాండియన్‌తో పోలీస్ అధికారి షణ్ముగవేల్ మాట్లాడుతున్నారు. ఇంతలో వెనుక వైపు నుంచి వచ్చిన చిన్న కుమారుడు మణికంఠన్ కొడవలితో ఆయనపై దాడి చేశాడు. ఆ తర్వాత తండ్రీ, పెద్ద కొడుకు కూడా పోలీస్ అధికారిని వెంటాడారు. ఆ ముగ్గురు కలిసి ఆయనను కొడవలితో నరికి చంపారు. ఇది చూసి పోలీస్ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాగా, పోలీస్ అధికారి షణ్ముగవేల్ హత్యపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. కోటి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ పోలీస్ అధికారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఎస్టేట్ వద్ద జరిగిన ఈ సంఘటనపై ఆ పార్టీ ఇంకా స్పందించలేదు.

## ఊటీలో పర్యాటక ప్రాంతాల మూసివేత.. కారణం ఏంటంటే..




చెన్నై-నవభూమి: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో నీలగిరి, కోవై జిల్లాల్లో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధనా కేంద్రం హెచ్చరికలతో ఈ రెండు జిల్లాకు రాష్ట్రప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. రుతుపవన ద్రోణి, మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా, కొండ ప్రాంతాల్లో బుధవారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది.దీంతో అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం కోవై, నీలగిరి జిల్లాల్లో పర్యాటక ప్రాంతాలను మంగళవారం మూసివేయడంతో పాటు ఊటీ మౌంట్ రైలు సేవలను తాత్కాలికంగా రద్దుచేసింది. బుధవారం తేని, తెన్‌కాశి జిల్లాల్లో మోస్తరు నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, దిండుగల్, తిరుప్పూర్, కృష్ణగిరి, ధర్మపురి(%ణష్టుతీఝబజూబతీఅ%), సేలం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది.%అ మేరకు ఎండీఆర్ఎఫ్ విభాగం సీఐ దీపక్ నేతృత్వంలో 10 మంది సభ్యుల బృందం మంగళవారం ఊటీలో మకాం వేసింది. కోవై జిల్లా వాల్పారైలో ఇప్పటికే ఎండీఆర్ఎఫ్ బృందం వరద నివారణ పనులకు సిద్ధంగా ఉంది. భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున పర్యాటక ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి.

## గద్దర్ లేకపోవడం పీడిత సమాజానికి తీవ్రమైన లోటు

ఆపదలో అయినవాళ్లు గుర్తుకు వస్తారు. ఈ రోజు మన దేశం, ముఖ్యంగా ఆదివాసీలతో కూడిన పీఢిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న విషమ పరిస్థితుల్లో, ప్రజా కళాకారుడు, విప్లవకారుడు, మానవతావాది అయిన గద్దర్ లేకపోవడం పీడిత సమాజానికి తీవ్రమైన లోటుగా మారింది. అతను ఉన్నట్లయితే ఏమై ఉండేది? ఈ ప్రశ్న ఒక్కటే ఈ వ్యవస్థలోని విఫలతల్ని, ప్రజాస్వామ్యానికి వచ్చిన సవాళ్లను, పాలకుల అరాచకాలను మొత్తం విశ్లేషించగలదు. గద్దర్ లేదు కానీ, అతని అవసరం, అతని ఆవేశం, అతని ఆలోచనలు, పాటలు, నడకలు, లంకెత్తులు ఇవన్నీ ఇప్పటికీ ప్రజల శ్వాసగా ఉన్నాయి.గత ఏడాది నుంచి గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలు ఒక పునాది వలె ఉన్నా, గద్దర్ స్వయంగా లేకపోవడం వల్ల ఉద్యమాల్లో ఆంతర్యం తక్కువైందన్నది నిజం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామాలలో ఎక్కడికెళ్లినా, ప్రజల వాదన ఒకటే "గద్దర్ ఉంటే ఇది జరిగేది కాదు..." అని. ఇది భక్తిభావానికి సంబంధించిన ప్రకటన కాదు. ఇది ఉద్యమాల నిర్వాహకునిగా అతను కలిగిన సామర్థ్యం, ప్రభావం, ప్రభుత్వాలపై అతని మాట విలువను సూచించే ఒక అనుభూతి. గద్దర్ లేని లోటు నిత్యానుభవంగా మారింది. ప్రత్యేకించి సామాజిక ఉద్యమాలకూ, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షకులకూ ఈ లోటు గాఢంగా కనిపిస్తోంది.గద్దర్ ప్రభావం రాజకీయంగా కాదు, ప్రజాసాంస్కృతికంగా. ఆయన ఒక నాయకుడిగా కాదు, నడిచే ఉద్యమంగా ఎదిగిన వ్యక్తి. తెలంగాణ ఉద్యమం మొదలు, రాష్ట్ర సాధన తరువాతికాలంలోనూ ఆయన తన సామాజిక స్పృహను కోల్పోలేదు. ప్రభుత్వాల అపసవ్య విధానాలను ప్రశ్నించడం కోసం పాటలు పాడాడు. సభలకే పరిమితం కాకుండా, అడవుల్లోని జానపద కూతల మధ్య ప్రజల చేతిలో తామరపత్రంలా ప్రవేశించాడు. ఆయన పాటలకే కాదు, ఆయన నడకలకూ న్యాయం ఉన్నది. ఎవరి పక్షానైనా కాదు, మానవతా పక్షాన నిలబడ్డాడు.ప్రస్తుతం దేశంలోని మానవ హక్కుల సంక్షోభం మధ్య మనం చూస్తున్న అంశాల్లో అత్యంత దారుణమైంది మృతదేహాల స్వాధీన విషయంలో పాలకుల నిర్లక్ష్యం. ఇటీవల నంబాళ్ల కేశవరావు అనే మావోయిస్టు నాయకుడి ఎన్‌కౌంటర్‌పై గద్దర్ ఉన్నట్లయితే ఆ సంఘటనకు స్పందన భిన్నంగా ఉండేది. అతని దేహాన్ని కుటుంబానికి అప్పగించకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానవీయమైనది. గద్దర్ గతంలో ఎన్నో సందర్భాల్లో పోలీసులతో ఘర్షణ పడుతూ, విప్లవకారుల మృతదేహాలను కుటుంబాలకు చేర్చేందుకు శవాల స్వాధీన కమిటీలు ఏర్పాటు చేశాడు. ఇది ఒక మానవతా ఉద్యమం. ఈ వ్యవహారంలో గద్దర్ పాత్రను అనుసరించడం నేటి పౌర హక్కుల ఉద్యమాలకు అత్యవసరం.ప్రస్తుతం ఆదివాసీలపై కొనసాగుతున్న దాడులు, దమన రాజకీయాలు గద్దర్ లేకుండా మరింత తీవ్రంగా, నిర్బాధితంగా సాగుతున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల జీవన విధానాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. గిరిజనుల అడవులపై చారిత్రక హక్కులను విస్మరించి, దాన్ని అభివృద్ధి పేరుతో ఆక్రమిస్తున్నాయి. లక్షలాది మంది పోలీసు, పారా మిలిటరీ బలగాలు సామాన్య ఆదివాసులపై హింసను నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. ఈ దశలో గద్దర్ లాంటి ఉద్యమ నేత ఉన్నట్లయితే, ఈ దమన విధానాలను అంతర్జాతీయ మద్దతుతో ప్రశ్నించగలిగేవాడు. గద్దర్ ఆదివాసుల గొంతుగా నిలిచినవాడు. వాళ్ల పాటలను, వాళ్ల బాధలను, వాళ్ల సంస్కృతిని తన గొంతులోకి తెచ్చినవాడు.గద్దర్ జీవితాంతం లి"అడవి మీద హక్కు ఆదివాసులదే"లి అనే సూత్రాన్ని తన ఉద్యమాలకు ఆదారంగా చేసుకున్నాడు. ఆయన రచించిన పాటలు, బ్యాలేలు, నాటకాలు ఈ విషయాన్ని నిరంతరం రుజువు చేశాయి. ఆయన సమాజంలో ఒక విప్లవకారుడిగా మాత్రమే కాకుండా, ఒక మానవతా తత్వవేత్తగా ఎదిగాడు. హింసను సమర్థించకుండా, హింసకూ కారణమైన కారణాలను విచ్ఛిన్నంగా వివేచించినవాడు. గద్దర్ లేని సమాజంలో ఇప్పుడు ఆ బలమైన శబ్దం లేదు. కానీ అతని శిల్పాలు, అతని భావాలు మిగిలేలా చేశాడు.ప్రజాస్వామ్య విలువలు సర్వత్రా సంకుచించిపోతున్నాయి. రాజ్యాంగం ఒక పుస్తకంగా మిగిలిపోయే ప్రమాదం గణనీయంగా పెరుగుతోంది. గద్దర్ ఈ సమయంలో ఉంటే తప్పకుండా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఒక దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించి ఉండేవాడు. అతని గొంతు లేకపోవడం, రాజకీయ, సామాజిక ఉద్యమాల దిక్సూచి లేకుండా పోవడం లాంటివే. గద్దర్ తన జీవితాంతం ఏవీ పార్టీలు కాదు, ప్రజలే తన బలంగా నమ్మాడు. ఆయనేనన్నాడు: లి"నాయకత్వం మేధస్సులో కాదు బాధలో ఉండాలి."లి ఆ బాధను అనుభవించేవాడు గద్దర్.మనకు ఇప్పుడు అవసరం గద్దర్ ఆశయాల వెలుగు. నేడు గద్దర్ ఉన్నట్టుగా మనం నిలవాలి. ఆయన ఆకాంక్షించిన సమాజాన్ని నిర్మించాలంటే మనం పాటలు పాడాలి, అడవులవైపు నడవాలి, అన్యాయంపై అడుగుపెట్టి నిలవాలి. ప్రజాస్వామిక హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి. ముసుగు వేసుకున్న అధికార దమనానికి ప్రత్యామ్నాయంగా ప్రజల మేధస్సు, మానవతా విలువలు నిలబెట్టాలి. గద్దర్ స్వరాన్ని కొనసాగించే బాధ్యత ఇప్పుడంతా మనదే.

గద్దర్ లేని లోటు
- ప్రభుత్వ అరాచకాలకు ఎదురు నిలిచే నేతల లోపం
- విప్లవకారుల హక్కులకు పోరాటం లేకపోవడం
- సామాజిక సంఘాలు విభజితంగా వ్యవహరించడం
- ఆదివాసీ హక్కులపై కేంద్ర రాష్ట్రాల దమన విధానాల మౌనం
- కళాకారుల మౌనం, రచయితల భయం

గద్దర్ ఉండకపోవచ్చు. కానీ అతని పాటలు ఉన్నాయి. అతని నడకలు ఉన్నాయి. అతని ఆశయాలు మనలో కలసి ఉన్నాయి. ఇప్పుడు అవసరం ప్రతి పౌరుడు గద్దర్ ఆశయాల వెలుగులో అడుగులు వేయడం. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలబడాలి. గద్దర్ అన్నట్లు

***"పాటే మా ఆయుధం,***
***ప్రజలే మా గమ్యం,***
***పరుల కోసం కాదు,***
***మన జాతి కోసం!"***

## తెలంగాణ ఉద్యమ జ్యోతి ఆచార్య కొత్తపల్లి జయశంకర్





ఆధిపత్యశక్తులపై అతడు వీరభద్రుడు, ఆలోచనల అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు, తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు, అతడే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్, తెలంగాణను స్వప్నించి, శాసించిన మహోపాధ్యుడు జయశంకర్ సార్ వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కన్నపేట గ్రామంలో లక్ష్మీ కాంతారావు, మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించాడు. హనుమకొండ లోని మార్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చాడు. హనుమకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక వరకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్. ఎస్. సీ వరకు చదువుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బి.ఏ పూర్తి చేశాడు. బెనారస్ విశ్వవిద్యాలయం, అలీగఢ్ విశ్వవిద్యాలయం నుండి పి.జి పూర్తి చేశాడు. జయశంకర్ సార్ సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో, కానీ ఏ విధంగా ఉద్యమంగా తీర్చిదిద్దాలో నిరూపించే సంఘటన ఒకటి ఈయన విద్యాభ్యాస కాలంలో జరిగింది. అప్పట్లో వరంగల్ లో డిగ్రీ కళాశాల లేదు. డిగ్రీ చదవాలంటే హైదరాబాదుకు వెళ్లాలి. లెక్చరర్స్ ప్రోద్బలంతో డిగ్రీ కాలేజీ కావాలని విద్యార్థులు ఉద్యమించారు. అందులో మొదటి వరుసలో జయశంకర్ ఉన్నాడు. ఈ సంఘటన తర్వాత పదేళ్లకు డిగ్రీ కాలేజీ, 30 ఏళ్లకు యూనివర్సిటీ వచ్చింది. ఏదైతే డిగ్రీ కాలేజీ యూనివర్సిటీ కోసం ఉద్యమం చేసిండో అదే యూనివర్సిటీకి ఆచార్య జయశంకర్ వైస్ ఛాన్సలర్ అయ్యాడు. 1960లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టడం ద్వారా ఉద్యోగ జీవితం మొదలైంది. హనుమకొండలో ఉపాధ్యాయుడిగా నియామకమై, లెక్చరర్ గా ఆదిలాబాద్ కు పోయాడు. 1975-79 వరకు సీ కె ఎం కళాశాల ప్రిన్సిపల్ గా, బోర్డు మెంబర్ సేవలందించాడు. 1982-91 వరకు సీఫేల్ రిజిస్టర్ గా పని చేశాడు. 1991-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గా పనిచేశాడు. ఇవే కాక వివిధ ప్రభుత్వం ఉద్యోగాల్లో సంఘాల పదవుల్లో పనిచేసి తనదైన ముద్ర వేశాడు. ఇన్ని పదవుల్లో పనిచేసిన నాకు సీ. కె ఎం. కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేయడం ఎక్కువ తృప్తి నిచ్చింది అని స్వయంగా అన్నా డు. మూడు దశలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయ శంకర్ కీలక పాత్ర పోషించాడు. 1952 లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా తెలంగాణకు జై కొట్టి తరగతులను బహిష్కరించాడు. వరంగల్లో మొదలైన ఉద్యమం హైదరాబాద్ కేంద్రీకృతమైంది. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధనకు ఎలాంటి వ్యూహాలు రచించారు జయశంకర్ కు తెలుసు. తెలంగాణ ఉద్యమానికి మూడు దశలు ఉన్నాయి. మొదటిది భావజాల వ్యాప్తి.అది జరిగింది.రెండవది ఆందోళన కార్యక్రమం. అది కొనసాగుతున్నది. ఇక మిగిలింది రాజకీయ ప్రక్రియ అది జరగాల్సి ఉంది. దానిని పూర్తి చేయడమే ఉద్యమ కర్తవ్యం కావాలి. దానికి రాజకీయ చిత్తశుద్ధి అవసరము ఇప్పుడున్న రాజకీయ నాయకత్వం ఆ పని పూర్తి చేస్తుందని అని నేను నమ్ముతున్నాను, అని అన్నాడు. మూడు దశలో కూడా జయశంకర్ మాత్రం మరువలేనిది. అందుకే అతడు తెలంగాణ సిద్ధాంతకర్త. మొదటిది తెలంగాణ భావజాల వ్యాప్తి. అది ప్రజలలో చొచ్చుక పోయిందో జయశంకర్ ఒక రోజు ఇట్లు చెప్పిండు. "ఎందుకమ్మా తెలంగాణ అంటే? సార్ తెలంగాణ వస్తే మా పొలాలకు నీళ్లు వస్తాయి, మా పోరగాళ్ళు కొలువులు వస్తాయి. అనే భావన వారికి కలిగింది " చదువురాని ఆడవాళ్లు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు. జయశంకర్ విద్యార్థి, సంఘ నాయకుడు గొప్ప పరిపాలనాదక్షుడు. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యశురుడు. తెలంగాణ కోసం తెలంగాణ రాజకీయ నాయకులకు తన సహకారం అందించాడు. చెన్న రెడ్డి నుండి చంద్రశేఖర్ రావు వరకు ప్రతి ఒక్కరి రాజకీయ పార్టీకి తన మేదో శ్రమను ధరపోశాడు. అయన ఆశిన్నట్లే చివరగా రాజకీయ ప్రకీయతో నే తెలంగాణ వచ్చింది. అందరిని తన మార్గంలో నడిపించాడు. అందుకే అతడు మార్గదర్శి. తెలంగాణకు చిరునామా, తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్.

**ఆగస్టు 6 ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా..**

**దేవులపల్లి రమేశ్**
**నంగునూర్, సిద్దిపేట,**
**9963701294**

## వ్యాసాలు పంపండి

**నవభూమి తెలుగు దినపత్రిక ఎడిట్ పేజీకి వ్యాసాలు పంపండి. తప్పుల్లేకుండా, ఇంగ్లీష్ అక్షరాలు ఉపయోగించకుండా యూనికోడ్ ఫాంట్‌లో పంపాల్సి ఉంటుంది.ఒకే సారి నాలుగు పత్రికలకు పంపితే ప్రచురించబడవు. నవభూమి కోసమే ప్రత్యేకంగా రాసినవి అయితేనే ప్రచురిస్తాం.ఇతర పత్రికల్లో ప్రచురితమైతే రచయితను బ్లాక్‌లో పెడతాం-ఎడిటర్**

navabhoomi1@gmail.com

## పల్లె జాన పదాలకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన మహానుభావుడు




**నిన్నటి సంచిక తరువాయి..**

**సినిమాలతో అనుబంధం**

మాభూమి సినిమాతో పాటు చాలా సినిమాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా గద్దర్ కు సంబంధం అనుబంధం ఉంది. బి నరసింగరావు దర్శకత్వంలో వచ్చిన మాభూమి సినిమాలో వెండితెరపై కనిపించినా ఆయన తర్వాత కాలంలో కూడా ఆర్ నారాయణ మూర్తి అనుబంధంతో ఎన్నో పాటలు రాశారు. శంకర్ దర్శకత్వం వహించిన ఎన్కౌంటర్ , శ్రీరాములయ్య, తర్వాత అడవిలో అన్న ఇలాంటి సినిమాలో కూడా పాటలు రాశారు. జై బోలో తెలంగాణ సినిమాలో ఆయన ఆడి పాడిన పాట పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా పాటతో తెలంగాణ సాధించడానికి ప్రాణం పోశారు. మొదటగా ఒరేయ్ రిక్షా సినిమాకు రాసిన పాట మల్లెతీగకు పందిరి పోలే నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా అనే పాటకు రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డు ప్రకటిస్తే సున్నితంగా తిరస్కరించారు . రెండోసారి జై బోలో తెలంగాణ సినిమాకు జై బోలో తెలంగాణ కోటి రత్నాల వీణ అనే పాట కూడా నంది



అవార్డు వస్తే రెండోసారి కూడా తిరస్కరించారు . ఆత్మగౌరవం కోసం అడుగడుగునా పోరాటం చేసిన యోధుడు గద్దర్ .

**మహాబోధి విద్యాలయం ఏర్పాటు**

అల్వాల్ వెంకటపురం ప్రాంతంలో పేద పిల్లలు మరియు అమరుల పిల్లల కోసం 1992 మహాబో ది విద్యాలయం ఏర్పాటు చేశారు .

**శాంతి చర్చల ప్రతినిధిగా**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పోలీసులు నక్సలైట్ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్న సమయంలో 2004 లో శాంతి చర్చల ప్రతినిధిగా చర్చల్లో పాల్గొన్నారు . నక్సలైట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి ప్రజల ముందు ఉంచారు .

**రాజ్యాంగ రక్షణ కై పోరాటం**

గత 20 సంవత్సరాలుగా రకరకాల కారణాలతో రాజ్యాంగంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని దానివల్ల సామాన్యులకు ప్రమాదం అని "సేవ్ కాన్స్టిట్యూషన్ సేవ్ ఇండియా " నినాదంతో పని చేశారు . ఎక్కడ సభలు సమావేశాలు జరిగిన తన చేత రాజ్యాంగం పట్టుకుని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రకటనలు చేశారు . నూతనంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ భవనానికి విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రతిపాదించారు .

కాంగ్రెస్ పాదయాత్రకు మద్దతు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆనాటి కాంగ్రెస్ పార్టీ సిఎల్ పి లీడర్ బట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుండి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రకు మద్దతు ఇచ్చారు .

గజ్వేల్ నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి ఆసక్తి

గద్దర్ ప్రజా పార్టీ ఏర్పాటు తన సొంత నియోజకవర్గమైన మెదక్ జిల్లా గజ్వేల్ నుండి అసెంబ్లీకి పోటీ చేయాలని నిర్ణయించారు . అందులో భాగంగా తనకు సొంత పార్టీ ఉండాలని భావించి గద్దర్ ప్రజా పార్టీ ని రిజిస్టర్ చేశారు.

**అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిక**

జూలై 2023 రెండో వారంలో అనారోగ్యానికి గురైన ఆసుపత్రిలో చేరారు గుండె ఆపరేషన్ తర్వాత కోలుకోలేక 6 ఆగస్టు 2023 న తుది శ్వాస వదిలారు . ఆయన ఆత్మగౌరవ పోరాటం పేదల పేదలు బాధితుల పక్షాన నిలిచిన వీరత్వం చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది .

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

## 13న జరుగనున్న అఖిల భారత నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా పాల్గొందాం!






ఒకవైపు మోడీ ప్రభుత్వం 'స్వాతంత్ర్య దినోత్సవాన్ని' ఘనంగా జరుపుకోవడానికి సిద్ధమవుతూనే, మరోవైపు అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాద శక్తుల ఆజ్ఞలకు లొంగుబాటుగా వ్యవహరిస్తున్నది. భారతదేశం రష్యా నుండి చమురు దిగుమతిపై ట్రంప్ పెట్టిన పెనాల్టీ టారిఫ్ బెదిరింపులపై ప్రభుత్వం తీసుకున్న మెతక వైఖరిలో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. ఇదే ట్రంప్, భారత ఎగుమతులపై 25% సుంకాన్ని విధించాలనే తన సంకల్పాన్ని కొనసాగిస్తూ, అమెరికా వ్యవసాయ సంస్థలకు భారతలో మార్కెట్‌ను తెరవాలని కోరుతున్నాడు.అలానే, మోడీ ప్రభుత్వం సంతకం చేసిన భారత్-యూకే సమగ్ర ఆర్థిక వర్తక ఒప్పందం ద్వారా బ్రిటన్‌కి చెందిన పాల, వ్యవసాయ మరియు ఆరోగ్య ఉత్పత్తుల కోసం భారతదేశం ఒక డంపింగ్ గ్రౌండ్ ( ఇబ్బడి ముబ్బడిగా అమెరికా నుంచి వచ్చే వస్తువులచెత్త కుప్ప లేదా వారి ఉత్పత్తులు అమ్మే కేంద్రంగా)గా మారబోతుంది. దీని ఫలితంగా పాల, మాంసం ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో భారత మార్కెట్లు నిండిపోతాయి. ఇప్పటికే వ్యవసాయంలో ఇన్‌పుట్ ఔట్‌పుట్ మార్కెట్లపై కార్పొరేట్ నియంత్రణతో కష్టపడుతున్న రైతుల జీవనోపాధి పూర్తిగా నాశనం కానుంది.ఈ చర్యలు కార్మికులు, రైతులు మరియు సామాన్య ప్రజలకు హానికరమైనవైనప్పటికీ, ఇవి ఒక్కసారిగా జరిగిన లేదా ఒంటరి పరిణామాలు కావు. ఇది గత పదిహేనేళ్ళుగా ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలోని ఫాసిస్టు మోడీ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్పొరేట్ అనుకూలమైన, మితవాద ఆర్థిక విధానాల లో భాగమే. ఇవన్నీ ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ డబ్ల్యూటీవో వంటి సామ్రాజ్యవాద అనుకూల సంస్థల శక్తుల ఆజ్ఞలతో అమలవుతున్నాయి.'విశ్వగురు', 'వికసిత భారత్', 'మేక్ ఇన్ ఇండియా' వంటి తప్పుడు జాతీయత" నినాదాల కింద, అదానీ, అంబానీ వంటి (ఆశ్రిత పక్షపాత) క్రోనీ క్యాపిటలిస్టులతో చేతులు కలిపి, మోడీ ప్రభుత్వం కార్మిక, పన్ను, పర్యావరణ సంబంధిత విధానాలను ప్రజలపై లాఘవంగా అమలు చేస్తోంది. ప్రజలు ఇప్పటికే తీవ్రమైన పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానత, దుర్భిక్షం ఫాసిస్టు అణచివేతలతో నష్టపోతున్నారు.ఈ నేపథ్యంలో, మేము కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు మరియు మతపరంగా, సామాజికంగా బాధితులైన ముస్లింలు, దళితులు, మహిళలు ప్రజాస్వామ్యవాద శక్తులందరినీ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా "భారతదేశాన్ని విడిచిపెట్టు - మళ్లీ!" అనే నినాదంతో పాల్గొనమని పిలుపునిస్తున్నాము.

సామ్రాజ్యవాదులు మరియు బహుళజాతి సంస్థలు భారతాన్ని విడిచిపెట్టి పోవాలి!

కార్పొరేట్-ఫాసిజం మరియు సామ్రాజ్యవాదం నశించాలి!

**కేంద్ర కమిటీ.**
**సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్**
**న్యూఢిల్లీ**

## ఆ దారిలో అంతా శుభమే


భక్తి



పూర్వం ఒక గ్రామంలో సామాన్యుడైన యువకుడు ఉండేవాడు. అతను రోజూ అయిదు పూటలా నమాజు చేసేవాడు. దివ్య ఖుర్‌ఆన్ పఠించేవాడు. తనకు ఉన్నదానిలో పేదలకు దానం చేసేవాడు. సమీపంలో ఉన్న పట్టణానికి పండ్లు తీసుకువెళ్ళి విక్రయిస్తూ జీవించేవాడు.

ఒక రోజు అతని దగ్గరకు ఒక సాధువు వచ్చాడు. పండ్లు తీసుకొని డబ్బు ఇవ్వబోయాడు. కానీ ఆ సాధువు ఎంత చెప్పినా డబ్బు తీసుకోవడానికి ఆ యువకుడు నిరాకరించాడు. "మీరు నా కోసం ప్రార్థన చేయండి. నా వ్యాపారం బాగా వృద్ధి చెందాలని అల్లాహను ప్రార్థించండి" అని కోరాడు. ఆ సాధువు సరేనంటూ ముందుకు సాగిపోయాడు. కొన్నాళ్ళలో ఆ యువకుడి వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. దానితో అతనిలో ఆశ పెరిగింది. డబ్బే లోకం అయిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు నమాజ్ చేసేవాడు. ఖుర్‌ఆన్ చదవడం క్రమంగా మానేశాడు. ఎవరైనా పేదలు దానం అడిగితే కోపగించేవాడు. బంధు మిత్రులను దగ్గరకు చేరనిచ్చేవాడు కాదు. పగలూ, రాత్రీ వ్యాపారం ఇంకా వృద్ధి చెందాలనే ఆశ, డబ్బు సంపాదించాలనే ఆలోచన తప్ప మరేదీ ఉండేది కాదు. అతణ్ణి పూర్వం కలిసిన సాధువు... కొన్నేళ్ళ తరువాత ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడ చాలా పెద్ద దుకాణం కనిపించింది. పండ్లు కొనడానికి లోపలికి వెళ్ళి చూస్తే... ఆ యువకుడు కనిపించాడు. కానీ ఈసారి అతనిలో మార్పు ఆ సాధువుకు స్పష్టంగా కనిపించింది. అతను కుర్చీ లోంచి లేవలేదు. సాధువుకు సలాం చేయలేదు. గుర్తు పట్టనట్టు ఉండిపోయాడు. ఆ సాధువే అతణ్ణి సమీపించి "ఏం నాయనా! బాగున్నావా?" అని అడిగాడు. "నేను బాగానే ఉన్నాను. మీకు ఏం కావాలో చెప్పండి" అని ఆ యువకుడు కసురుకున్నాడు. ఆ సాధువు ఆశ్చర్యపడ్డాడు. కొన్ని పండ్లు తీసుకొని, డబ్బు ఇచ్చాడు. అక్కడినుంచి వెళ్ళిపోతూ "నాయనా! వ్యాపారంలో నీకు శుభం కలగాలని, నీ ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటున్నాను" అని అన్నాడు. ఆ యువకుడు కుర్చీలోంచి లేచి "మీ ప్రార్థనలు నాకు అవసరం లేదు. ఇదంతా నా కష్టంతో సంపాదించింది. మీరు ఇక్కడినుంచి వెళ్ళిపోండి "అంటూ దుకాణం నుంచి తరిమేశాడు. కొద్ది రోజులలో అతని వ్యాపారం దెబ్బతింది. నష్టాల్లో కూరుకుపోయాడు. ఆరోగ్యం క్షీణించింది. అతని ధోరణి భరించలేక భార్య తమ పిల్లలతో తన పుట్టింటికి వెళ్ళిపోయింది. అతని జీవితం చిందరవందరైపోయింది.

ఆ సాధువు ఒకరోజు ఆ మార్గంలోంచి వెళ్తూండగా... ఒక చెట్టు కింద చిన్న బండిలో పండ్లు అమ్ముకుంటూ ఆ యువకుడు కనిపించాడు. సాధువు అతని దగ్గరకు వెళ్ళి పలకరించాడు. ఆ యువకుడు ఏడుస్తూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు. అప్పుడు ఆ సాధువు "నాయనా! మనం కష్టంలో ఉన్నా, సుఖంలో ఉన్నా అల్లాహను గుర్తు చేసుకోవాలి. నమాజ్ క్రమం తప్పకుండా చేయాలి. పేదలకు దానధర్మాలు చేయాలి. నిత్యం దివ్య ఖుర్‌ఆన్ చదవాలి. ఇరుగుపొరుగువారిని, బంధువులను, మిత్రులను మరచిపోకూడదు" అని బోధించాడు. తన ప్రస్తుత స్థితికి కారణం తను చేసిన పొరపాట్లేనని ఆ యువకుడికి అర్థమయింది. అతను పశ్చాత్తాపం చెందాడు. సాధువును క్షమించాలని కోరాడు, అల్లాహకు క్షమాపణలు చెప్పుకున్నాడు. ఆ సాధువు కొంత డబ్బును ఆ యువకుడి చేతిలో పెట్టి... "అల్లాహ్ చూపిన మార్గంలో చిత్తశుద్ధితో నడిస్తే అంతా శుభమే జరుగుతుంది. ఈ డబ్బుతో, అల్లాహ్ పేరుతో మంచి వ్యాపారం మొదలు పెట్టు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఇంతలో నమాజ్ సమయమయిందనే పిలుపు వినిపించడంతో... భక్తిపూరితమైన మనసుతో ఆ యువకుడు మసీదు వైపు నడిచాడు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్ గురువారం 07 । ఆగస్టు । 2025

## ఎన్నికల వేళ ఖుష్బూ సంచలన కామెంట్స్.. డీఎంకే బండారం బయటపెడతా



**చెన్నై-నవభూమి:** ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలన్నీ డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్నట్లుగా స్టిక్కర్లు వేసుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నటి ఖుష్బూఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేసిన అవినీతి అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని, పాలకుల అసలు రంగు బయటపడుతుందన్నారు.మీడియాతో ఆమె మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం రైతులకు, విద్యార్థులకు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి అర్హులకు చేరకముందే ఆ పథకాలకు డీఎంకే ప్రభుత్వ స్టిక్కర్లు, ప్రత్యేకించి స్టాలిన్ ఫొటోల స్టిక్కర్లు అతికించి, ఆ పథకాలన్నీ తమవిగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, బాలికలకు, యువతులకు,వృద్ధులకు భద్రతలేదని, అత్యాచారాలు, హత్యలు, నేరాలు రోజురోజుకూ అధికమవుతున్నాయే గానీ తగ్గటం లేదని ఖుష్బూ ఆరోపించారు.. హోం మంత్రిత్వ శాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా అచేతనంగా ఉంటూ తమ ప్రభుత్వం కోసం గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. త్వరలోనే ప్రజలంతా డీఎంకే పాలనకు చరమగీతం పాడనున్నారని ఖుష్బూ జోస్యం చెప్పారు.

## దారుణం.. కన్న కూతురు ముందే అల్లుడిని హత్య చేసిన తండ్రి.. ఎందుకంటే?



**దర్భాంగా-నవభూమి:** బీహార్‌లో దారుణం చోటుచేసుకుంది. కులాంతర వివాహం చేసుకున్నందుకు కన్న కూతురు ముందే తండ్రి ఘోరానికి పాల్పడ్డాడు. అల్లుడిని గన్‌తో కాల్చి హత్య చేశాడు. అసలేం జరిగిందంటే.. దర్భంగా మెడికల్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తన్నూ ప్రియ అదే కాలేజీలో చదువుతున్న రాహుల్ కుమార్ అనే వ్యక్తిని ప్రేమించింది. అతడు బీఎస్సీ నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అయితే, వీరిద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు తమ ప్రేమ పెళ్లిని ఒప్పుకోరని భావించి కొన్ని నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. కానీ, ఇద్దరూ వారి వారి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు.అయితే, ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న తన్నూ ప్రియ తండ్రి ప్రేమ్‌శంకర్ ఝూ కోపంతో రగిలిపోయాడు. తన కుటుంబ పరువును నాశనం చేసిందని వెంటనే తన దగ్గర ఉన్న గన్ తీసుకుని కాలేజీకి వెళ్లి తన కూతురు ప్రియ ముందే రాహుల్ కుమార్‌ను కాల్చాడు. అతడికి ఛాతిలో బుల్లెట్ తగలడంతో వెంటనే కుప్పకూలాడు. వెంటనే అప్రమత్తమైన స్థానిక విద్యార్థులు తన్నూ ప్రియ తండ్రిని అడ్డుకున్నారు. ఆ వెంటనే హుటాహుటినా రాహుల్ కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రేమ్‌శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.ఈ విషయంపై ప్రియ మాట్లాడుతూ.. తన తండ్రి రాహుల్‌ను కాల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తన భర్త పరిస్థితికి తన కుటుంబం మొత్తం కుట్రలో భాగమని, తన పెళ్లి సమయంలో తమ రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించామని, అయినా కూడా ఇలా జరిగిందని వాపోయింది. రాహుల్‌కు న్యాయం చేయాలని స్థానిక విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రియ తండ్రిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేపట్టారు. ప్రస్తుతం ఆసుపత్రి దగ్గర ఆందోళనకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా, భారత ప్రభుత్వం కులాంతర వివాహాల వల్ల కుల వివక్ష తగ్గుతుందని, సామాజిక సమైక్యత పెరుగుతుందని నమ్ముతూ కొన్ని పథకాలు ప్రవేశపెడుతుంటే, తల్లిదండ్రులు మాత్రం కుటుంబ పరువు, ప్రతిష్టలంటూ ఇలా దారుణాలకు తెగబడుతున్నారు.

## ఈడీ విచారణకు అనిల్ అంబానీ హాజరు



**న్యూఢిల్లీ-నవభూమి:** మనీ లాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం రిలయన్స్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ (66) మంగళవారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 10.50 నిమిషాలకు ఆయన విద్యుత్తు వాహనంలో ఈడీ కార్యాలయానికి వచ్చారు. వివిధ బ్యాంకుల నుంచి తన గ్రూపులోని కొన్ని కంపెనీల పేరున తీసుకున్న రూ.17వేల కోట్ల రుణాలను అదే గ్రూపులోని మరికొన్ని కంపెనీలకు మళ్లించారంటూ నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎల్ఎంఏ) చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది.

## ధర్మస్థలలో 100 ఎముకలు లభ్యం



**బెంగళూరు-నవభూమి;** కర్ణాటకలోని ధర్మస్థలలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆధ్వర్యంలో జరుపుతున్న తవ్వకాలలో ఇప్పటి వరకు 100 ఎముకలు లభ్యమయ్యాయి. మరో 3 అస్థిపంజరాలు లభ్యమయ్యాయనే ప్రచారాన్ని సిట్ తోసిపుచ్చింది. ఫిర్యాదుదారు చూపించిన 13 ప్రదేశాలకుగాను ఇప్పటి వరకు 12 ప్రదేశాల్లో తవ్వకాలు జరిపారు. బుధవారం 13వ ప్రదేశంలో తవ్వకాలు చేపట్టనున్నారు. అవసరమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ తవ్వకాలకు సిద్ధంగా ఉన్నామని సిట్ వర్గాలు తెలిపాయి. 6వ ప్రదేశంలోనూ, 11వ ప్రదేశానికి 100 మీటర్ల దూరంలోని 11-ఏ ప్రదేశంలోనూ ఎముకలు లభించాయి. ఆ ఎముకలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షిస్తున్నారు. 11వ ప్రదేశంలో కాకుండా బంగ్లగుడ్డపై తవ్వకాలు జరపాలని ఫిర్యాదుదారు కోరిన నేపథ్యంలో సోమవారం అక్కడ(11-ఏ) జరిపిన తవ్వకాలలో ఒక అస్థిపంజరం లభించింది. అయితే, 11-ఏ ప్రదేశంలో కనీసం మూడు అస్థిపంజరాలు లభించాయని బాధితుల తరపు న్యాయవాదులు తెలిపారు. వాటిలో ఒకటి మహిళదని, అక్కడ చీర కూడా లభ్యమైందని చెప్పారు. అయితే, దీన్ని పోలీసులు తోసిపుచ్చారు.

## స్నేహితుడ్ని అడ్డుకుని.. దళిత మహిళపై సామూహిక అత్యాచారం

**భోపాల్-నవభూమి:** ఒక మహిళ తన స్నేహితుడితో కలిసి విహారయాత్ర కోసం అటవీ ప్రాంతానికి వెళ్లింది. అక్కడ ఫొటోలు దిగుతుండగా కొందరు వ్యక్తులు వచ్చారు. స్నేహితుడ్ని కొట్టి అడ్డుకున్నారు. దళిత మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక యువతి తన స్నేహితుడితో కలిసి చుర్హాట్ అటవీ ప్రాంతానికి విహార యాత్ర కోసం వెళ్లింది. అడవిలోని కాలి బాటలో మరింత లోపలకు వారు వెళ్లారు. అక్కడ ఫొటోలు దిగారు.కాగా, ఐదుగురు వ్యక్తులు అక్కడకు చేరుకున్నారు. కర్రతో స్నేహితుడి తలపై కొట్టారు. ఇద్దరు వ్యక్తులు అతడ్ని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులు ఆ యువతిని దూరంగా లాక్కెళ్లారు. అక్కడ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని వారిని హెచ్చరించారు. ఇద్దరి మొబైల్ ఫోన్స్ తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు.మరోవైపు స్నేహితుడితో కలిసి అటవీ ప్రాంతం నుంచి బయటపడిన దళిత యువతి సమీపంలోని గ్రామానికి చేరుకున్నది. అక్కడున్న కార్మికులకు జరిగిన విషయం చెప్పింది. దీంతో గ్రామ సర్పంచ్ సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బాధిత దళిత యువతిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. నిందితుల కోసం ఆ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.

# హిమాలయాల్లో అలజడి.. ధరాలీ క్లౌడ్ బరస్ట్ సంకేతమా?



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రశాంతంగా ఉన్న ప్రకృతి ఉన్నట్టుండి మహావిలయం సృష్టించింది. మెరుపు వరదల వల్ల ఉత్తరాఖండ్ ఉత్తరకాశీ జిల్లా ధరాలీలో కొండ ప్రాంతం దిగువన ఉన్న ఇళ్లు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 10 మందికి పైగా చనిపోగా.. 50 మందికి పైగా అదృశ్యమయ్యారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. ముగ్గురు ఐఏఎస్ అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే ఉత్తర భారతంలోని హిమాలయ ప్రాంతాల్లో తరచూ క్లౌడ్ బరస్ట్‌లు సంభవిస్తాయి. ఇలాంటివి అక్కడ సర్వసాధారణం అయిపోయాయి. ఈ క్రమంలో అసలు ఈ క్లౌడ్ బరస్ట్‌లు అంటే ఏమిటి, అవి ఎలా సంభవిస్తాయి? దానికి కారణాలేంటి? నిపుణుల అభిప్రాయాలేంటి? ధరాలీ ప్రత్యేకత ఏంటి? ఇప్పుడు తెలుసుకుందాం.

**క్లౌడ్ బరస్ట్ అంటే ఏమిటి?**

అకస్మాత్తుగా, తక్కువ సమయంలో భారీ వర్షాలు కురవడాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఇది సాధారణ వర్షం కంటే భిన్నమైనది. క్లౌడ్ బరస్ట్ సంభవిస్తే.. 20 నుంచి 30 కిలో మీటర్ల పరిధిలో గంటకు 100 మిల్లీమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఇదే వ్యవధిలో వర్షపాతం 50 మిల్లీమీటర్ల కంటే తక్కువ నమోదైతే.. దాన్ని మినీ క్లౌడ్ బరస్ట్ అంటారు. ఈ క్లౌడ్ బరస్ట్‌లు సాధారణంగా పర్వత ప్రాంతాలు, కొండలు ఉన్న ప్రాంతాల్లో సంభవిస్తాయి.వేడి గాలులు తేమను పర్వత ప్రాంతాలపైకి తీసుకుని వెళ్తాయి. అప్పుడు చల్లని గాలులు తగిలి వేగంగా చల్లబడతాయి. దీంతో భారీగా నీటి ఆవిరి ఘనీభవించి.. ఒకేసారి భారీ వర్షం కురుస్తుంది. మరోవైపు భూమి ఉపరితలం ఎక్కువ వేడి ఎక్కినప్పుడు.. గాలి పైకి వెళ్తుంది. ఈ గాలిలో తేమ ఎక్కువగా ఉంటే.. పైకి వెళ్లినప్పుడు వేగంగా చల్లబడుతుంది. దీంతో భారీ మేఘాలు ఏర్పడతాయి. ఇది క్లౌడ్ బరస్ట్‌లకు దారితీసే ప్రమాదం ఉంది. ఇక అస్థిర వాతావరణం కూడా క్లౌడ్ బరస్ట్‌లకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు.పర్వత ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్‌లు సాధారణమే అయినా.. నష్టం పెరగడానికి కొన్ని మానవ తప్పిదాలు కూడా తోడయ్యాయని నిపుణులు భావిస్తున్నారు. ధరాలీ, హర్సిల్ వంటి పర్యాటక ప్రాంతాల్లో.. వాణిజ్య అవసరాల కోసం విపరీతంగా నిర్మాణాలు చేపట్టారు. ప్రత్యేకంగా ధరాలీలో కొండ ప్రాంతం నుంచి వచ్చే వరద సహజ ప్రవాహ మార్గాన్ని.. నిర్మాణాలు చేపట్టి అడ్డుకున్నారు. ఒక్కసారిగా భారీ మొత్తంలో బురద దిగువన ఉన్న నివాస, వాణిజ్య సముదాయాలను కప్పేసింది.హిమాలయాలు చాలా సున్నితమైనవి. ఇక్కడ జరుగుతున్న అడ్డగోలు నిర్మాణాలు.. అడవుల నరికివేత వంటివి భూమిని బలహీనపరుస్తున్నాయి. దీనివల్ల కొండచరియలు విరిగిపడే ప్రమాదం పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు.. హిమాలయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో అసాధారణ వాతావరణ పరిస్థితులు, అధిక వర్షపాతం, క్లౌడ్ బరస్ట్‌లు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.ధరాలీలో జరిగింది క్లౌడ్ బరస్టేనా?

మంగళవారం (ఆగస్టు 5) ధరాలీ గ్రామాన్ని ధ్వంసం చేసిన ఆకస్మిక వరదకు గ్లేషియర్ (హిమానీనదం) కూలిపోవడం లేదా గ్లేషియర్ సరస్సు ఉప్పొంగడం కారణం అయ్యే అవకాశం ఉందని.. వాతావరణ, ఉపగ్రహ డేటాను విశ్లేషిస్తున్న నిపుణులు ప్రాథమికంగా అంచనావేస్తున్నారు. అందుకే అంత భారీ పరిమాణంలో నీటి ప్రవాహంతో బురద ధరాలీని ముంచెత్తి ఉండవచ్చని చెబుతున్నారు. మంగళవారం హర్సిల్ ప్రాంతంలో 24 గంటల్లో 9%ఎఎ% వర్షం మాత్రమే కురిసింది. భట్వానిలో 11%ఎఎ% మాత్రమే పడింది. అయితే క్లౌడ్ బరస్ట్ సంభవిస్తే ఇంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. దీంతో గ్లేషియర్ కూలిపోవడం, గ్లేషియర్ లేక్ ఉప్పొంగడం వల్లనే ప్రమాదం సంభవించి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సుందర ధరాలీ..** ఉత్తరఖండ్‌లో ఉన్న సుందరమైన ప్రదేశాల్లో ధరాలీ ఒకటి. చార్‌ధామ్ యాత్రికులు ఈ గ్రామాన్ని ఎక్కువగా సందర్శిస్తుంటారు. ఈ గ్రామానికి సమీపంలోనే భాగీరథి నది ఉంది. సముద్ర మట్టానికి సుమారు 2680 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ గ్రామానికి రిషికేశ్ నుంచి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్ మీదుగా వెళ్లొచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలోనే గంగోత్రి ధామ్ ఉంది. ధరాలీ మధ్య నుంచి నేషనల్ హైవే ఉంటుంది. చార్‌ధామ్‌తో పాటు ఇతర యాత్రలకు వెళ్లే సందర్శకులు ధరాలీకి భారీ సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఇక్కడ చాలా లాడ్జీలు, గెస్ట్ హౌజ్‌లు ఉన్నాయి. అందుబాటులో ధరలు ఉన్నందున.. ఇక్కడ బస చేయడానికి యాత్రికులు ఆసక్తిచూపిస్తారు.క్లౌడ్ బరస్ట్‌ల వల్ల జరిగే నష్టాలు.. క్లౌడ్ బరస్ట్‌లు.. ఆకస్మిక మెరుపు వరదలను సృష్టిస్తాయి. వీటి వల్ల కొండచరియలు విరిగి పడతాయి. దీంతో కొండ ప్రాంతాల్లో ఉండే గ్రామాలపై ప్రభావం పడుతుంది. ధరాలీలో సంభవించిన క్లౌడ్ బరస్ట్ వల్ల నలుగురు మరణించారు. 50 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు చెబుతున్నారు. మెరుపు వరదల వల్ల ప్రభావిత ప్రాంతంలో ఉండే ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు, రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు కొట్టుకుపోవడం లేదా పూర్తిగా ధ్వంసం అవుతాయి. దీంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లుతుంది. ధరాలీలో 20-25 హోటళ్లు, గెస్ట్‌హౌజ్‌లు, అనేక దుకాణాలు ధ్వంసమయ్యాయి.క్లౌడ్ బరస్ట్‌ల వల్ల వచ్చే వరదలు వ్యవసాయ భూములు, పంటలు బురదలో కూరుకుపోవడం వల్ల భారీ నష్టం జరుగుతుంది. క్లౌడ్ బరస్ట్‌ల వల్ల కొండచరియలు విరిగిపడతాయి. నేల కోతకు గురవుతుంది. నదీ ప్రవాహాలలో మార్పులు వచ్చి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. నదులలో ఎక్కువగా సిల్ట్ చేరడం వల్ల.. వాటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయి భవిష్యత్తులో వరదల ప్రమాదాన్ని పెంచుతుంది.ధరాలీలో సంభవించిన మెరుపు వరదలు.. ఎక్కడో జరిగిన ఒంటరి విపత్తు కాదు. హిమాలయ ప్రాంతం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన, పర్యావరణ సంక్షోభానికి ఇది స్పష్టమైన సంకేతం. ధరాలీ లాంటి విపత్తు భవిష్యత్తులో పునరావృతమయ్యే అవకాశం ఉన్నందున.. పర్యావరణ సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. సుస్థిరమైన అభివృద్ధి పద్ధతులు పాటించాలి. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండే, సరస్సుల దిగువన ఉండే ప్రాంతాల్లో సమగ్ర విపత్తు నిర్వహణ వ్యూహాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# విమానాశ్రయాలకు ఉగ్రవాద ముప్పు

### ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో దేశవ్యాప్తంగా హైఅలర్ట్



**లక్నో-నవభూమి:** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని విమానాశ్రయాలలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో ఒక ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. పాకిస్థానీ ఉగ్రవాద సంస్థ నుంచి ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర భద్రతా సంస్థల నుంచి అందిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అడ్వైజరీ జారీ అయిన తర్వాత విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్, రాష్ట్ర పోలీసులతో సహా అన్ని భద్రతా ఏజెన్సీలు అప్రమత్తం అయ్యాయి.ఈ భద్రతా హెచ్చరికల నేపథ్యంలో.. రన్వేలు, హెలీప్యాడ్స్, ఫ్లైయింగ్ స్కూల్స్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో భద్రత పెంచాలని సూచించింది. ముఖ్యంగా విమానాశ్రయాల్లోకి ప్రవేశించే సిబ్బంది, సందర్శకులకు కఠినమైన గుర్తింపు కార్డు తనిఖీలను తప్పనిసరి చేశారు. అలాగే ప్రయాణికుల తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయనున్నారు. విమానాశ్రయ ప్రాంగణంలో ప్రతి కదలికను నిరంతరం పర్యవేక్షించడానికి సీసీటీవీ వ్యవస్థను నిరంతరం ఆన్‌లైన్‌లో ఉంచాలని, ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ చిన్నపాటి నిఘా లోపం కూడా లేకుండా చూసుకోవాలని భద్రతా సంస్థలను ఆదేశించారు. ముఖ్యంగా టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా, పెరీమీటర్ జోన్, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను కూడా పెంచారు. స్థానిక పోలీసుల సహకారంతో ఎయిర్ పోర్టులకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో పంపే మెయిల్ పార్శిళ్లను కూడా క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. సిబ్బంది, కాంట్రాక్టర్లు, విజిటర్స్‌ను కూడా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. విమానాశ్రయాల వద్ద అనుమానాస్పదంగా ఏవైనా లగేజీ బ్యాగులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌ను కూడా యాక్టివేట్ చేశారు. అవసరం అయితే ఎయిర్ పోర్టుల్లో మాక్ డ్రిల్స్ చేపట్టాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగానే స్థానిక పోలీసులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ , ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి వివిధ ఏజెన్సీలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని కూడా సూచించారు. ఈ ఏడాది ఇప్పటికే అనేక విమానాశ్రయాలకు బాంబు బెదిరింపుల రూపంలో నకిలీ హెచ్చరికలు వచ్చాయని, జూలై 20 నాటికి 69 ఇలాంటి కాల్స్ నమోదు అయ్యాయని ఈ అడ్వైజరీ వెల్లడించింది. కానీ ఈసారి వచ్చిన హెచ్చరిక ఒక నిర్దిష్టమైన ఉగ్రవాద ముప్పుకు సంబంధించినది కాబట్టి దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాలని సూచించింది. దేశంలోని అన్ని విమానాశ్రయాల అధికారులు ఈ హెచ్చరికను పాటించి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది.

### మరో మహిళతో భర్త సరసాలు..

# పెళ్లైన ఐదు నెలలకే గర్భిణి సూసైడ్



**లక్నో-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో లో విషాద ఘటన చోటు చేసుకుంది. కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన ఓ మహిళ.. పెళ్లైన ఐదు నెలలకే తనువు చాలించింది. భర్త వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. అయితే, భర్త మాత్రం తన భార్య ఆత్మహత్య చేసుకుందని చెప్తుండగా.. యువతి కుటుంబం మాత్రం కట్నం కోసం తమ బిడ్డను హింసించి హత్య చేశారని ఆరోపిస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నోకు చెందిన అనురాగ్ సింగ్ హాంకాంగ్‌కు చెందిన షిప్ మేనేజ్‌మెంట్ సంస్థలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మధు (32) అనే మహిళతో ఈ ఏడాది ఫిబ్రవరి 25న వివాహం జరిగింది. అయితే, వివాహం సమయంలో రూ.15 లక్షలు కట్నం డిమాండ్ చేసినట్లు యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా యువతి ఫ్యామిలీ చూపించింది. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు ఇవ్వగలిగినట్లు చెప్పారు. అయితే, పెళ్లైన తర్వాత అనురాగ్ తనకు కట్నం కోసం పదేపదే ఫోన్ చేసి ఒత్తిడి చేశాడని మధు తండ్రి ఫతే బహదూర్ సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లైన నెలలోపే తొలిసారి తన కూతురు మధుపై అల్లుడు అనురాగ్ దాడి చేశాడని, దీంతో ఆమె పుట్టింటికి తిరిగి వచ్చినట్లు చెప్పారు. అడిగిన కట్నం చెల్లించామని.. దీంతో బిడ్డను తిరిగి తీసుకెళ్లినట్లు వివరించారు. అయితే, తన కూతురిని హింసించడం మాత్రం ఆపలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాదు అనురాగ్ వేరే అమ్మాయితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని ఆరోపించారు. ఇటీవలే ఓ హోటల్‌లో తన మాజీ ప్రియురాలితో ఓ రాత్రి గడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 31న హోటల్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా ఫిర్యాదులో పంచుకున్నారు. ఆగస్టు 3 ఆదివారం నాడు అనురాగ్ తనపై దాడి చేసినట్లు మధు తన అక్క ప్రియతో చెప్పినట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురు గర్భవతి అని, తనను కడుపు తీయించుకోమని ఒత్తిడి చేసినట్లు చెప్పారు. 'ఆగస్టు 4న సాయంత్రం 4:32 గంటలకు అతను ఫోన్ చేసి నా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పాడు. అతడే నా కూతురిని చంపాడని నేను అనుకుంటున్నాను' అని మధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.మరోవైపు మధు అక్క ప్రియ మాట్లాడుతూ.. 'నా చెల్లి చాలా లైవ్‌లీ పర్సన్. కానీ అనురాగ్ మాత్రం ఆమె ఎవరితోనూ మాట్లాడటం ఇష్టపడేవాడు కాదు. స్నేహితులతో కూడా మాట్లాడనిచ్చే వాడు కాదు. ఆఖరికి మాతో కూడా మాట్లాడొద్దని చెప్పేవాడు. అతను ఊర్లో లేనప్పుడు మాత్రమే మేము మాట్లాడుకునే వాళ్లం. ఆమె ఫోన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేవాడు. ఎటువంటి కారణం లేకుండానే మా చెల్లిని కొట్టేవాడు. తనతో కలిసి డ్రింక్ చేయమని ఒత్తిడి తెచ్చేవాడు. చివరి సారిగా తనతో మాట్లాడినప్పుడు.. అనురాగ్ కొట్టినట్లు చెప్పింది. అప్పుడు తనని ఇంటికి తీసుకురావాలని అనుకున్నాను. కానీ మళ్లీ గొడవ జరుగుతుందనే భయంతో ఆగిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది.

**పనిమనిషిని రావొద్దని మెసేజ్ పెట్టి..**

యువతి ఫ్యామిలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనురాగ్‌ను విచారించారు. అయితే, ఆగస్టు 4న మధ్యాహ్నం సమయంలో 112 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినట్లు అనురాగ్ పోలీసులకు చెప్పాడు. కానీ మధు కుటుంబానికి మాత్రం ఐదు గంటలు ఆలస్యంగా సాయంత్రం 4:30 గంటలకు కుమార్తె మరణ వార్త సమాచారం అందింది. ఆరోజు పనిమనిషిని కూడా ఇంటికి రావొద్దని అనురాగ్ మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కానీ, ఆ మెసేజ్ చూసుకోకుండా మెయిడ్ ఇంటికి వచ్చింది. ఆమె చాలాసార్లు మెయిన్ డోర్ బెల్ కొట్టినా ఎవరూ తలుపు తెరవలేదు.అంతేకాదు, ఆ రోజు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అనురాగ్ ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసుకున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణ సమయంలో.. మధు ఆత్మహత్య చేసుకుందని అనురాగ్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అందుకు కారణాలు ఏంటని అడగ్గా అతడి నుంచి సమాధానం రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు అతనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. అయితే, కస్టడీలోకి తీసుకున్న తర్వాత అనురాగ్ సిగరెట్లు అడుగుతూనే ఉన్నాడని పోలీసులు తెలిపారు.


## ఐదు చిన్న పార్టీలతో తేజ్‌ప్రతాప్ కూటమి



**పాట్నా-నవభూమి:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఐదు చిన్న పార్టీలతో కలిపి ఒక కూటమిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్జేడీ బహిష్కృత నేత, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ మంగళవారంనాడు ప్రకటించారు. ఆ ఐదు పార్టీల అధ్యక్షులతో కలిసి మీడియా సమావేశంలో ఈ విషయం వెల్లడించారు.వికాస్ వంచిత్ ఇన్సాన్ పార్టీ (వీవీఐపీ), భోజ్‌పురియ జన్ మోర్చా (బీజేఎం), ప్రగతిశీల్ జనతా పార్టీ (పీజేపీ), వజిబ్ అధికార్ పార్టీ (డబ్ల్యూఏపీ), సంయుక్త్ కిసాన్ వికాస్ పార్టీ (ఎస్‌కేవీపీ)లతో కలిసి కూటమిని ఏర్పాటు చేస్తున్నట్టు తేజ్‌ప్రతాప్ ప్రకటించారు.అసెంబ్లీ ఎన్నికల్లో 2020 వరకూ తాను ప్రాతినిధ్యం వహించిన మహువా నుంచే ఈసారి పోటీ చేయనున్నట్టు తేజ్ ప్రతాప్ వెల్లడించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'టీమ్ తేజ్ ప్రతాప్ యాదవ్'తో కనెక్ట్ అయినట్టు చెప్పారు. 'జనం నవ్వుకున్నా సరే నేను నా సొంత మార్గంలోనే ప్రయాణించాలనుకుంటున్నాను. మా కూటమి సామాజిక న్యాయం, సామాజిక హక్కులు, బీహార్‌లో సమగ్ర మార్పుల కోసం పాటుపడుతుంది' అని ఆయన చెప్పారు. ప్రజలు తమకు అనుకూలంగా తీర్పునిస్తే రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని, రామ్ మనోహర్ లోహియా, కర్పూరి ఠాకూర్, జయప్రకాష్ నారాయణ్ కన్న కలలను నిజం చేస్తామని తెలిపారు.అనుష్క అనే అమ్మాయితో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానని తేజ్ ప్రతాప్ ఇటీవల సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ రాజకీయంగా కలకలం సృష్టించింది. తేజ్ ప్రతాప్‌కు అప్పటికే వివాహం కావడం, ఆ వివాహం చిక్కుల్లో పడిన నేపథ్యంలో ఆర్జేడీ ఆయనపై క్రమశిక్షణ చర్యలకు దిగింది. పార్టీ నుంచి ఆరేళ్ల పాటు ఆయనను బహిష్కరించింది.

## ట్రంప్ ద్వంద్వనీతి.. 1954 నుంచి పాక్‌కు అమెరికా ఆయుధాల ఎగుమతి చూస్తే షాకవ్వాల్సిందే

**న్యూఢిల్లీ-నవభూమి:** రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తే ఇండియాపై ప్రస్తుతం విధిస్తున్న 25 శాతం సుంకాలను రాబోయే 24 గంటల్లో మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులు జరిపిన కొద్ది గంటలకే ట్రంప్ 'హిపోక్రసీ'ని ఇండియన్ ఆర్మీ ఎండగట్టింది. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌కు అందజేసిన సాయంపై నిలదీసింది. 1954 నుంచి పాక్‌కు 2 బిలియన్ డాలర్లు విలువ చేసే ఆయుధాలను అమెరికా పంపించిందని తెలిపింది. ఇందుకు సంబంధించి 1971 ఆగస్టు 5న వార్తాపత్రికలో వచ్చిన క్లిప్పింగ్‌ను ఇండియన్ ఆర్మీ ఈస్టర్న్ కమాండ్ విడుదల చేసింది. '1954 నుంచి పాకిస్థాన్‌కు 2 బిలియన్ డాలర్లు విలువచేసే ఆయుధాలు సరఫరా అయ్యాయి' అనే శీర్షికతో ఈ కథనం ప్రచురితమైంది. బంగ్లాదేశ్‌లో ఇస్లామాబాద్ దురాక్రమణను నాటో దేశాలు పట్టించుకోలేదని కూడా ఆ కథనం ఆరోపించింది.అప్పటి రక్షణ ఉత్పత్తుల మంత్రి వీసీ శుక్లా పార్లమెంటులో ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు కూడా ఆ కథనం పేర్కొంది. పాకిస్థాన్‌కు ఆయుధాలు అమ్మేందుకు ఫ్రాన్స్, సోవియట్ యూనియన్ వంటి దేశాలు నిరాకరిస్తే, ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో కూడా పాకిస్థాన్ కు అమెరికా ఆయుధాల సరఫరాను కొనసాగించిందని శుక్లా పార్లమెంటులో చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 1971 ఘర్షణల్లో బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్ చర్యలను నాటో దేశాలు పట్టించుకోలేదని మంత్రి ఆక్షేపణ తెలిపారు. అమెరికా, చైనాలు ఆకర్షణీయ ధరలకు తమ ఆయుధాలను పాక్‌కు అమ్ముకున్నారని, ఆ దేశాలు సమకూర్చిన ఆయుధాలతోనే పాకిస్థాన్ యుద్ధం చేసిందన్నారు. దక్షిణాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న దశలో ఈ కథనం ప్రచురితమైంది. ఆ తర్వాత కొద్ది నెలలకు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి మద్దతుగా భారత్ నిలిచింది.కాగా, ట్రంప్ తాజా హెచ్చరికలపై భారత్ నిశిత వ్యాఖ్యలు చేసింది. వాషింగ్టన్ ద్వంద్వ ప్రమాణాలను ఎత్తి చూపింది. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు చమురు ధరలు చుక్కలనంటినప్పుడు రష్యా నుంచి దిగుమతులను అమెరికా ప్రోత్సహించిందని గుర్తుచేసింది. గ్లోబల్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగానే ఇండియా కొనుగోళ్లు ఉంటాయని తెలిపింది.



## రంగు చుక్కల అర్థం

## నవతార



ఆహార ప్యాకెట్లపై ఎరుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో మాంసాహారాన్ని వినియోగించారని అర్థం. చికెన్, మటన్, చేప లాంటి మాంసాహారాలతో తయారు చేసినవిగా గుర్తించాలి. ఆహారపు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద ఆకుపచ్చని చుక్క ఉంటే వాటిని శాఖాహారంతో తయారుచేశారని తెలుసుకోవాలి. వీటి తయారీలో గుడ్డు, మాంసం వినియోగించలేదని అర్థం. ప్యాకెట్లపై నీలి రంగు చుక్క ఉంటే అవి వైద్య పరమైన ఉత్పత్తులని అర్థం. నిర్ధిష్టమైన వ్యాధి నివారణకు వైద్యుల సలహా మేరకు మాత్రమే వాటిని వినియోగించాలి. అదే పసుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో గుడ్లు వాడారని తెలుసుకోవచ్చు. ప్యాకెట్ల మీద నలుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తులను రసాయనిక పదార్థాలతో ప్రాసెస్ చేసి ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా తయారుచేశారని అర్థం. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యం ప్రభావితమవుతుందని తెలుసుకోవాలి.

# ఇన్‌స్టా అన్నపూర్ణ.. ఆమె రోటి పచ్చడి నూరుతుంటే.. ఇంటిల్లిపాదీ నోరూరాల్సిందే



ఆమె రోటి పచ్చడి నూరుతుంటే.. ఇంటిల్లిపాదీ నోరూరాల్సిందే. వంకాయ బడితం చేస్తే.. వాడకట్టంతా ఇంటి ముందు వాలిపోతుంది. పులిహోర కలుపుతున్నదని తెలిస్తే.. ఉపవాస దీక్ష మధ్యాహ్నానికే ముగుస్తుంది. ఆ పెద్దావిడ అమృత హస్తం గురించి చుట్టాలు, పక్కాలకే కాదు ఊరంతా తెలుసు! ఏడాది క్రితం నుంచి ఆమె తిరగమోత పెట్టినా ఇన్‌స్టాలో లైకుల మోత మోగుతున్నది. 89 ఏండ్ల పెద్దావిడ రోజుకో వెరైటీతో ఈ తరాన్ని పలకరిస్తున్నది. 'ద అయ్యర్ పాతి' పేరుతో పాకయాగం చేస్తూ ఇన్‌స్టా అన్నపూర్ణగా పేరొందిన సరస్వతి నారాయణస్వామి ఇప్పుడు ఓ సెలెబ్రిటీ. ఏడాదిలోనే 84 వేల మంది ఫాలోవర్లను సొంతం చేసుకొని.. సామాజిక మాధ్యమాల్లో దూసుకుపోతున్న బామ్మ జర్నీ ఇది..

అవే కూరగాయలు.. అదే వంట పద్ధతి. కానీ, కొందరు ఆడంబరంగా వంట చేసినా ముద్ద నోటికి దిగదు. మరికొందరు పైపైన వంట కానిచ్చినా.. 'అద్భుతః' అన్నట్టుగా ఉంటుంది పదార్థం. సరస్వతి బామ్మ రెండో రకం. వంటింటి రాజ్యాన్ని ఆమె 78 ఏండ్లుగా పరిపాలిస్తున్నది మరి. పదకొండేండ్ల వయసులో గరిటె తిప్పడం అలవాటు చేసుకున్న ఆమె.. సంప్రదాయ రుచులను చేయడంలో సిద్ధహస్తురాలు. సరస్వతి తల్లిదండ్రులకు పదకొండు మంది సంతానం. ఆరో కాన్పులో ఈమె జన్మించింది. ఆమెకు పదేండ్లు ఉండగా తల్లి కన్నుమూసింది. అప్పట్లో వీళ్ల కుటుంబం కాలికట్‌లో ఉంటుండేది. ఇల్లాలు లేని ఇల్లు. పైగా పెద్ద కుటుంబం. సరస్వతి మేనత్త వారింట్లోనే ఉండేది. వంట బాధ్యత నిర్వర్తిస్తున్న మేనత్తకు చేదోడువాదోడుగా ఉండటం అలవాటు చేసుకుంది సరస్వతి. ఆమె వంట ఎలా చేస్తుందో దీక్షగా గమనించేది. అడపాదడపా తనూ చేతులు కాల్చుకునేది. ఒకట్రెండేండ్లు గడిచే సరికి మేనత్తకే పాఠాలు చెప్పేంతగా పాకశాస్త్రంపై పట్టు సాధించింది.

**ముద్దుల కోడలు**

1959లో సరస్వతి వివాహం అయింది. భర్త బ్యాంకు ఉద్యోగి. బెంగళూరులో కొత్త కాపురం పెట్టారు. ఆమె వంటకాలకు ఆయన దాసోహం అయ్యాడు. పూటకో వెరైటీ చేయమని పురమాయించి మరీ రుచులు ఆస్వాదించేవాడు. అత్తారిల్లూ పెద్దదే! ఆరుగురు తోడికోడళ్లు. అత్తగారి పెత్తనం షరామామూలే! పైగా సనాతన వైదిక కుటుంబం. మడి, ఆచారాలు కామన్. ఆ కాలం ఇల్లాళ్లు వీటన్నిటినీ గౌరవంగా, బాధ్యతగా భావించేవారు.

సరస్వతిదీ అదే మనస్తత్వం. ఆ వైఖరే అత్తగారితో ముద్దుల కోడలు అనిపించుకునేలా చేసిందని ఇప్పటికీ సిగ్గుపడుతూ చెబుతారు సరస్వతి. 'అందరూ బాగానే వండుతారు. నువ్వు చేస్తే ఏదో మంత్రం వేసినట్టుగా ఉంటుందే కోడలా! వంట చేయడాన్ని ఏదో పనిలా కాకుండా.. క్రతువుగా భావిస్తావు' అని అత్తగారు సరస్వతికి తరచూ కితాబిచ్చేవారట. దక్షిణాది వంటకాల్లోని వెరైటీలన్నీ చిటికెలో చేసేస్తారామె. పాలక్కడ్ పాలకూర మొలకలు, మద్రాస్ రసం, బెంగళూరు సాంబారు ఇలా శాకాహార వంటకాలు వందల రకాలు చేయడంలో ఆమెది అందెవేసిన చేయి.

**అలా మొదలైంది..**

దశాబ్దాలు గడిచిపోయాయి. సరస్వతి దంపతులకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలూ కలిగారు. 80వ పడిలోనూ మూడో తరానికి వండి వడ్డిస్తూ ముచ్చట తీర్చుకుంటున్నారామె. ఆ వంటకాలు తింటూ 'నువ్వు సూపర్ బామ్మ' అని పిల్లలు తెగ పొగిడేవారు. ఈ ప్రశంసలు విని ఆమె నవ్వి ఊరుకునేదంతే! ఇదిలా ఉండగా.. ఓసారి తన మనవరాలికి కూతురు పుట్టినప్పుడు దిష్టి దారం పేని కట్టింది సరస్వతి. ఆ వైనాన్నంతా మరో మనవరాలు వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్టు చేసింది. దిష్టి దారం ప్రత్యేకతను కూడా ఆమెతోనే చెప్పించింది. ఆ వీడియోకు విపరీతంగా లైకులు వచ్చాయి. ఇదేదో బాగానే ఉందనిపించింది. 'బామ్మా! నీకెన్నో ఫుడ్ వెరైటీలు వచ్చుకదా! వాటన్నిటినీ వీడియోలు తీసి ఇన్‌స్టాలో పోస్టు చేద్దాం' అన్నదట. 'ఈ వయసులో ఇవన్నీ ఎందుకే?' అని అభ్యంతరం చెప్పారు సరస్వతి. మనవరాలు వినలేదు. చివరికి బామ్మకు ఒప్పుకోక తప్పలేదు. అలా 2024 జనవరిలో 'ద అయ్యర్ పాతి' పాకశాల మొదలైంది.

**ఏడాదిలోనే..**

రకరకాల వంటకాలు ఆమె వండే విధానం చూసి ఫాలోవర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఏడాదిలో ఏకంగా 300 రకాల వంటల తయారీ వీడియోలు పోస్టు చేశారు సరస్వతి. అవన్నీ సూపర్ హిట్టే! పప్పు, పచ్చిపులుసు లాంటి సాదాసీదా వంటలు కావవి. తరాల కిందట వాళ్లు రుచిగా, శుచిగా వండుకున్న సంప్రదాయ పాకాలు. వాటిని ఈ తరానికి పరిచయం చేస్తూ.. పాత రుచులనే కొత్తగా అందిస్తున్నారు సరస్వతి. మజ్జిగ పులుసులో వెరైటీలు, వంకాయ పచ్చళ్లలో రకాలు, ముద్దపప్పు మతలబులు, మిర్చీబజ్జీ ఘుమఘుమలు, అరటికాయ మసాలా, పెరుగుతో వండే పప్పుకూరలు ఇలా వివిధ రకాల వంటలు రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారామె. మనవరాలి సాయంతోనే కావొచ్చు! కానీ, ఆమె మాటతీరు, వంటకాలు చేసే నైపుణ్యానికి ఈ తరం ఫిదా అయింది.

ఏడాదిలోనే దాదాపు 84 వేల మంది ఆమెకు ఫాలోవర్లుగా మారారు. అంతేకాదు, 'ద అయ్యర్ పాతి' పేరుతో యూట్యూబ్ చానెల్ కూడా నిర్వహిస్తున్నారు సరస్వతి. ఇందులో పాకశాస్త్ర పాఠాలు పంచుకోవడంతో పాటు వాగ్గేయకారుల కృతులనూ రసరమ్యంగా ఆలపిస్తారు కూడా! 'నాకు పదిహేనేండ్లు వచ్చినప్పటి నుంచి వంటలు చేస్తూనే ఉన్నాను. నేను వండిన పదార్థాల్ని ఇంట్లోవాళ్లు తృప్తిగా ఆరగిస్తుంటే నా కడుపు నిండేది. కానీ, ఈ వంటకాలే నాకు ఇంతటి పేరు ప్రఖ్యాతులు తెస్తాయని ఎన్నడూ ఊహించలేదు. ఇన్నాళ్లకు నా ప్రతిభకు ఇలా గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంద'ని చెబుతున్న సరస్వతి నారాయణస్వామి అచ్చంగా ఇన్‌స్టా అన్నపూర్ణే!

# ఫ్యాషన్ రంగవల్లిక బంజారా అల్లిక



దుస్తులంటే నాగరికత. ఆ దుస్తులే అస్తిత్వ పతాకలు. రంగులే అభిరుచుల వ్యక్తీకరణ. ఆహార్యమే గుర్తింపు, గౌరవం, వారసత్వం. అవన్నీ కోల్పోతే పరాయీకరణే. రంగురంగుల హంగులు ఉండే వస్త్రశ్రేణితో అలరించిన నిన్నటి తరం బంజారాలు.. కాల ప్రవాహంలో తమ ఆహార్యాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతించిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే కాదు.. ఆ బంజారాల వస్త్ర సౌందర్యాన్ని ఆధునిక దుస్తులకు ఆపాదిస్తున్నది బంజారా కసూతి సంస్థ. లంబాడీ మహిళలను ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవం వైపు నడిపిస్తున్నది.

తెలంగాణలో లంబాడీలు ఉన్నట్టే.. కర్ణాటకలోనూ ఉన్నారు. వీరిని లంబానీలు అని పిలుస్తారు. ప్రాంతం వేరైనా వీరి కట్టూ, బొట్టూ ఒకేలా ఉంటుంది. విజయపుర ప్రాంతంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడి మహిళలు చూపు తిప్పుకోలేనంత అందమైన దుస్తులు, ఆభరణాలను నిండుగా ధరించేవారు. ఒకప్పుడు వీరి ఆహార్యం చూడగానే బంజారాలని గుర్తుపట్టేవాళ్లు. కానీ, ఇప్పుడు తలపై నుంచి జారుతూ ఉండే అద్దాల అంచుల టుక్రీ మెరుపులు లేవు. సంప్రదాయ గాగ్రీ (లెహంగా) కూడా ధరించట్లేదు. కాంక్లీ (రవిక లాంటిది), దాని పైనుంచి వేసుకునే ఆభరణాలు కూడా దాదాపు కనుమరుగయ్యాయి. గాగ్రీ బదులు చీర కట్టుకుంటున్నారు. ఒకప్పుడు వస్త్రధారణ వల్ల ప్రత్యేకంగా కనిపించే ఈ బంజారా బిడ్డలు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరిలా ఉండాలన్న కోరిక వాళ్లకు లేదు. సంప్రదాయ వస్త్రధారణ పట్ల ప్రేమ తప్ప వ్యతిరేకత లేదు. వారసత్వ కళ మీద మమకారమే కానీ ఛీత్కారం లేదు. వారికి లేనిదల్లా ఉపాధే! డబ్బే అన్నిటినీ శాసిస్తున్న ఈ కాలంలో వారి జీవన సౌందర్యం కనుమరుగైపోయింది.

**కనువిందు చేసే అందాలు**

చేతిలో డబ్బుల్లేని కాలం దాపురించడంతో బతుకు దెరువు కోసం కూలీనాలీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గూడేల్లో దర్జాగా ఉన్న బంజారా బతుకులు పట్నాల్లో పరుగులు తీయడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో వాళ్లకే సొంతమైన అల్లికలు చిక్కుల్లో పడ్డాయి. అలా మెరిసే అద్దాలు దారాల కుట్లకు దూరమయ్యాయి. రంగురంగుల అతుకులు ఆదరించేవాళ్లు లేక గతుక్కుమన్నాయి. అల్లి'కళ'కు దూరమై సంప్రదాయ వస్త్రశ్రేణిని కాదని సింథటిక్ చీరలు చుట్టుకుంటున్నారు బంజారా మహిళలు. ఆరోగ్యవంతమైన వస్త్రధారణ వదిలి రోగాల్ని అంటించే వస్త్రాలను ఆదరిస్తున్నారు. ఈ దయనీయమైన స్థితిని ఆశా పాటిల్ గుర్తించింది. విజయపురలో పుట్టిన ఆమె చిన్నప్పటి నుంచి లంబానీల దుస్తులు, వాటి ప్రత్యేకతలను ముచ్చటపడి చూస్తూ ఉండేది. కాలక్రమంలో వచ్చిన మార్పుల వల్ల లంబాడీల దుస్తులు మాయమవడం ఆమెను కలచి వేసింది. ఆ సామాజిక వర్గంలో ఎంబ్రాయిడరీ మెలకువలు తెలిసిన మహిళల్ని చేరదీసి ఆ కళను బతికించే పనికి పూనుకున్నది. బంజారా కసూతి అనే సంస్థను ప్రారంభించింది. సృజనాత్మకమైన అల్లికల్లో చేతి వృత్తుల వారి నైపుణ్యాలను, సంప్రదాయ దుస్తులను కాపాడుకోవడం ఈ సంస్థ లక్ష్యం.

**పల్లెల్లో ఫ్యాషన్ పాఠాలు**

హస్తకళలు, సంస్కృతిని కాపాడుకోవడం కోసం పాటుపడితే కడుపునిండట్లేదనే హస్తకళాకారులు ఇతర వృత్తులకు మారిపోతున్నారు. ఈ రెండు పరిణామాలతో ఎన్నో హస్తకళలు అంతరించి పోతున్నాయి. అవసాన దశలో ఉన్న లంబాడీ ఎంబ్రాయిడరీ, చేనేత హస్తకళలను కాపాడుకోవాలంటే ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత కల్పించడం కూడా బంజారా కసూతి లక్ష్యంగా పెట్టుకుంది. విజయపుర సమీప గ్రామాలను ఒక యూనిట్‌గా ఆశా పాటిల్ ఎంపిక చేసుకుంది. ఆ గ్రామాల్లో అల్లిక నైపుణ్యం ఉన్న 18 మంది బంజారా మహిళలను గుర్తించింది.

వారంతా కలిసి పనిచేసేందుకు, కొత్త పనులు నేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. మార్కెట్‌కి అనుగుణంగా ఆధునిక దుస్తులపై లంబాడీల అల్లికల డిజైన్లు వేసేందుకు వాళ్లకు శిక్షణ ఇచ్చారు. ఎంబ్రాయిడరీలో వాళ్లకు ఉన్న నైపుణ్యంతోపాటు అందులో రాటుదేలేలా, పనిచేసేలా ప్రోత్సాహాన్ని అందించింది ఆశా. వర్క్‌షాప్‌లు నిర్వహించి ఆధునిక దుస్తులు, మార్కెట్ గురించి అవగాహన కల్పించింది. బంజారా కసూతి ప్రయాణం మొదలైన తర్వాత ఆశా పాటిల్‌తో కలిసి పనిచేసేందుకు సీమా కిశోర్ చేయి కలిపింది. ఇద్దరూ కలిసి లంబాడీ కళను, సంప్రదాయాలను కాపాడుతూ రేపటి కోసం కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు.

**అద్దాల మెరుపులెన్నో**

బంజారా కసూతి లక్ష్యం నెరవేర్చేందుకు ఖాదీ, కాటన్, లినెన్, మిక్స్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన దుస్తులపై అల్లికల డిజైన్లను వేయించడం మొదలుపెట్టారు. సంప్రదాయ దుస్తులైన కుర్తా పైజామాల నెక్, హ్యాండ్ బార్డర్‌లపై అద్దాల మెరుపులు, రంగుల అల్లికలతో ఫ్యాషన్ మార్కెట్‌కి కొత్తందాలు పరిచయం చేశారు. చీరలు, రవికెలకు ఈ అల్లికలు మరింత సొబగుగా కుదిరాయి. ఇక పాశ్చాత్య దుస్తులపై వేసిన బంజారా కసూతి డిజైన్లకు విశేషంగా ఆదరణ లభించింది. యువత డిమాండ్‌కు అనుగుణంగా బంజారా అతివలు అద్భుతాలు చేశారు. ఈ విజయం తర్వాత వస్త్రంతో తయారుచేసిన హ్యాండ్ బ్యాగులు, కుషన్లపై కూడా బంజారా అద్దాల మెరుపులు అద్ది ఇల్లు చక్కదిద్దుకుంటున్నారు.

**ప్రౌడ్ బంజారా**

చేనేత వస్త్రాలను, ఎంబ్రాయిడరీని ఈతరానికి నచ్చేలా తీర్చిదిద్దడంలో బంజారా కసూతి కృషి ఫలించింది. అనుకున్నట్టే వాళ్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరడంతో వేరే వ్యవసాయ పనులకు వెళ్లకుండా పూర్తిగా అల్లికలు, కుట్ల పనుల్లోనే ఉండిపోయారు ఆ మహిళలు. ఒక ప్రాంతంలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని మిగతా ప్రాంతాలకు విస్తరిస్తూ పోయారు ఆశా, సీమా. ఇప్పుడు మొత్తం అయిదు ప్రాంతాల్లో బంజారా కసూతి పని చేస్తున్నది. అరవై మంది మహిళలు ఎంబ్రాయిడరీనే జీవనాధారంగా ఎంచుకుని బతుకుతున్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ అల్లికను రేపటి తరం మరచిపోకుండా కాపాడుకునేందుకు వారికి బంజారా కసూతి ఓ అవకాశం కల్పించింది. అంతేకాదు లంబాడీల వేషభాషలపై సమాజంలో ఉండే చిన్నచూపు వల్ల వాళ్ల పిల్లల్లో న్యూనతాభావం పెరిగింది. సంప్రదాయ దుస్తులు ధరించడానికి ఆసక్తి చూపట్లేదు. బంజారా కసూతి ప్రయోగంతో బంజారా వస్త్ర శ్రేణికి నగరాల్లో ఆదరణ పెరిగింది. దీంతో తమ వారసత్వ దుస్తు లు ధరించడం కోసం ఆసక్తి చూపడమే కాదు గర్వంగా భావిస్తున్నారు బంజారా అతివలు.





## కథలు చెప్పే కేక్‌లు



'బేకరీకి వెళ్లగానే ముందుగా నన్ను ఆకట్టుకొనేవి కేక్‌లు. అందుకు కారణం వాటిపై కనిపించే డెకరేషన్. చిన్నప్పటి నుంచీ నా దృష్టి దానిపైనే ఉండేది. ఆ ఆసక్తే ఇవాళ నన్ను కేక్ ఆర్టిస్టను చేసింది. నేను పుట్టి పెరిగిందంతా మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లాలో. ప్రణవేశ్ దబాల్‌తో పెళ్లి తరువాత మా నివాసం ముంబయికి మారింది. ఇంట్లో ఖాళీ దొరికినప్పుడల్లా రకరకాల కేక్‌లు తయారుచేస్తుండేదాన్ని. ఫ్లేవర్స్ మాత్రమే కాకుండా... విభిన్న డిజైన్లు ప్రయత్నిస్తుండేదాన్ని. కొంతకాలానికి అనిపించింది... పూర్తి స్థాయిలో ఈ కళను నేర్చుకోవాలని. నా అదృష్టం ఏంటంటే... సుగర్ క్రాఫ్ట్‌లో పేరు పొందిన సర్ ఎడ్డీ స్పెన్స్ దగ్గర శిష్యరికం చేసే అవకాశం రావడం. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో జరిగే శుభ కార్యాలకు ఆయన కేక్‌లు తయారు చేసేవారు. 2015లో యూకే వెళ్లి ఆయన వద్ద ఈ కళను అభ్యసించాను.

భారత్‌కు తిరిగి వచ్చాక నాదంటూ ప్రత్యేక శైలి ఉండేలా కేక్‌లు రూపొందించడంపై దృష్టి పెట్టాను. అందుకోసం ఎన్నో పరిశోధనలు, లెక్కలేనన్ని ప్రయోగాలు చేశాను. క్రమంగా వీగన్ కేక్‌లు మొదలుపెట్టాను. దాంతో ఆదరణ పెరిగింది. అంతేకాదు... కేక్ తయారీని సమకాలీన కథలు చెప్పే ఒక సాధనంగా మలిచాను. ఇదే నన్ను ప్రత్యేకంగా నిలిపింది. ఈ ఆలోచనా విధానమే నాకు పలు అవార్డులు, అభినందనలు తెచ్చి పెట్టింది. 2021లో 'స్వదేశ్ సమ్మాన్' పురస్కారం అందుకున్నాను. 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. ఇంకా ఎన్నో ఉన్నాయి.

ఆ పాప కళ్లల్లో మెరుపులు...ఒకసారి ఒక పదేళ్ల చిన్నారి తల్లితో కలిసి కేక్ డెలివరీ తీసుకువెళ్లడానికి వచ్చింది. కోట, దాని ముందు యువరాణి డిజైన్‌లో రూపొందించిన కేక్ అది. చూడగానే ఆ చిన్నారి కళ్లు మెరిసిపోయాయి. ఆ క్షణం నేను నా చిన్నప్పటి రోజులకు వెళ్లిపోయా. ఎడిన్ బ్లైటన్ కథలు చదువుతూ... మాయా ప్రపంచం గురించి కలలు కనేదాన్ని. ఆ పాపవల్ల ఆ పాత మధురాలు మళ్లీ కళ్ల ముందు కదలాడాయి. కాసేపు నన్ను నేను మరిచిపోయా. ఆ అనుభూతి ఎంతో అద్భుతంగా అనిపించింది. దాన్ని అందరికీ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. అందుకే కోటలు, రాణులు, కళలు ఉట్టిపడేలా... అవి ఒక అందమైన కథ చెప్పేలా కేక్‌లు తయారు చేస్తున్నా.

నా ప్రాజెక్టులు అన్నిటిలోకెల్లా మరిచిపోలేనిది, అత్యంత కష్టమైనది 'ద్యుమో డి మిలనో' ఇటాలియన్ కేథడ్రాల్ చర్చి రెప్లికా. 6.4 అడుగుల ఎత్తు, 4.6 అడుగుల వెడల్పుతో రూపొందించిన వంద కేజీల వీగన్ కేక్ అది. దీని తయారీకి వంద గంటలకు పైగా సమయం పట్టింది. అంతపెద్ద కేక్‌ను నిలబెట్టాలంటే... చెదరని ఏకాగ్రత, అపారమైన ఓర్పు అవసరం. అన్నిటికీ మించి ఇలాంటి పురాతన, వారసత్వ కట్టడాల ప్రతిరూపాన్ని తయారు చేయాలంటే కళాత్మకత, వాస్తుశిల్ప శైలిని ఆకళింపు చేసుకొనే సామర్థ్యం కావాలి. ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు నేను కట్టడం వాస్తుశిల్ప శైలి గురించి లోతుగా అధ్యయనం చేశాను. కనుకనే ఉన్నది ఉన్నట్టు కేక్‌పై చూపించగలిగాను. ఇది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. కేక్ అంటే నాకు చూడగానే ఆకర్షించి, నోట్లో వేసుకోగానే కరిగిపోయేలాంటి తీపి పదార్థం మాత్రమే కాదు... ఒక భావోద్వేగ బంధం. దాని తయారీ ఒక యజ్ఞం.

స్ఫూర్తి అవే...నేను ఎంత పెద్ద కేక్‌లు చేసినా వాటిల్లో కోడిగుడ్డు వాడను. క్రీమ్ నుంచి కేక్ మిక్సింగ్ తయారీ వరకూ అన్నీ మొక్క ఆధారిత ఉత్పత్తులతో చేసిన పదార్థాలే ఉపయోగిస్తాను. కథక్ లాంటి సంప్రదాయ నాట్యం కావచ్చు... హస్తకళాకృతులు, చేనేతలు కావచ్చు... వారసత్వ కట్టడాలు కావచ్చు... మన చుట్టూ ఉండేవాటినే స్ఫూర్తిగా తీసుకొని కేక్‌లు రూపొందిస్తాను. ఇప్పటి వరకు ఇండియన్ ప్యాలెస్, పైథానీ చీర అంచు, బెంగాలీ పెళ్లికూతురు ధరించే సంప్రదాయ చీరలు, నగలు, మణిపురీ నాట్యం లాంటి నిలువెత్తు ప్రతిరూపాలు ఎన్నో నేను తయారు చేశాను. వాటిని చూసినప్పుడు నా మనసు పరవశిస్తుంది. ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. నేను కోరుకున్నది ఇలాంటి అనుభూతినే."

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ గురువారం 07 ఆగస్టు 2025

# నవ బిజినెస్




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 166 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్..!

**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనాలకు అనుగుణంగా కీలక వడ్డీ రేట్లను యథావిధిగా కొనసాగించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 5.5 శాతం వద్దే ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ ప్రస్తుతం ఉన్న 5.5 శాతం రెపోరేటు కొనసాగుతుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం




80,694.98 ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 80,834.43 పాయింట్ల గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,448.82 పాయింట్లకు పడిపోయింది. చివరకు 166.26 పతనమై.. 80,543.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.35 పాయింట్లు తగ్గి 24,574.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో విప్రో, సన్ ఫార్మా, జియో ఫైనాన్షియల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా అత్యధికంగా నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్ (0.6 శాతం) మినహా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, రియాల్టీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ ఒకటి నుంచి 2శాతం తగ్గాయి. ఇతర రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.

## ఆర్బీఐ కీలక ప్రకటన.. రెపో రేటు యథాతథం..




**ముంబై-నవభూమి:** రెపో రేటు(యథాతథంగా ఉంచాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ మేరకు రెపో రేటు 5.5 శాతం దగ్గరే కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిణామాలతో రెపో రేటు యథాతథంగా ఉంచినట్లు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటనల నేపథ్యంలో రెపో రేటు అలాగే ఉంచాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ప్రస్తుతం ద్రవ్యోల్బణం 4 శాతం వద్ద స్థిరంగా ఉందని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అది 3.1 శాతానికి తగ్గొచ్చని అంచనా వేశారు. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదవ్వొచ్చని పేర్కొన్నారు ఆర్బీఐ గవర్నర్. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటూ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నప్పటికీ భారత్ ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా ముందుకెళ్తోందని శుభవార్త చెప్పారు.

అలాగే ఈ ఏడాది రుతుపవనాలు సమృద్ధిగా కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో వర్షాలు ఎక్కువగా కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని పేర్కొన్నారు. దీని వల్ల ద్రవ్యోల్బణం మరింత దిగువకు రానుందని ఎంపీసీ నిర్ణయాలను సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్బీఐ.. ప్రస్తుత సంవత్సరంలో రెపో రేటును 1 శాతం మేర తగ్గించిన విషయం తెలిసిందే.

## సీసీఎల్ ప్రొడక్ట్స్ లాభం రూ.72 కోట్లు

**హైదరాబాద్-నవభూమి:** సీసీఎల్ ప్రొడక్ట్స్... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,058.03 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.72.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.774.62 కోట్లుగా ఉండగా లాభం రూ.71.47 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.963.84 కోట్ల నుంచి రూ.687.44 కోట్లకు పెరిగాయి. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.537.55 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.31.36 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

## తగ్గిన ఎన్‌సీసీ లాభం

**హైదరాబాద్-నవభూమి:** ఎన్‌సీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,207.93 కోట్ల టర్నోవర్‌పై రూ.192.14 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.5,558.33 కోట్లుగా ఉండగా లాభం రూ.209.92 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.3,658 కోట్ల ఆర్డర్లను దక్కించుకుంది. దీంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.70,087 కోట్లకు చేరుకుంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.4,429.64 కోట్ల స్టాండ్‌ఎలోన్ ఆదాయంపై రూ.190.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

## కష్టాల్లో పౌల్ట్రీ పరిశ్రమ.. సమస్యల్లో పెంపకందారులు

### ఐకార్, డీపీఆర్ అధ్యయనంలో వెల్లడి



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగంగా ఉంటూ ఉపాధి, ఆదాయాలపరంగా పెద్దదైన కోళ్ల పెంపకం పరిశ్రమ.. పెను సమస్యలను ఎదురొంటోందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ (డీపీఆర్) అధ్యయనంలో వెల్లడైంది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు, వైద్య సిబ్బంది కొరత ఉందని, టీకాలు తగినన్ని అందుబాటులో లేవని గుర్తించింది. గుడ్లు, చికెన్ ధరలలో అస్థిరత్వం ఈ రంగం ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారినట్టు డీపీఆర్ తాజా నివేదికను విడుదల చేసింది.

**5 లక్షలమందికి ఉపాధి..**

దేశీయంగా కోళ్లు, గుడ్ల ఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని డీపీఆర్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇక్కడ 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని పేర్కొంది. దేశంలోని కోళ్లలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా.. సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. అయితే వాణిజ్య కోళ్ల పెంపకం ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ విధానాలతో కొనసాగుతుండగా.. నాటుకోళ్ల పెంపకం అసంఘటితంగా ఉన్నట్టు వెల్లడించింది. నిర్వహణలోనూ సంరక్షణ, మారెటింగ్ సమస్యలు ఎదురవుతున్నట్టు అధ్యయనం గుర్తించింది. రాష్ట్రంలో దాణా, పోషక విలువల పరిశీలన, పోషకాహార లోపాన్ని గుర్తించడానికి అవసరమైన ప్రయోగశాలలు సైతం అందుబాటులో లేవన్నది.

**నాటుకోళ్ల సంరక్షణ..**

నాటుకోళ్ల ఉత్పత్తి లాభదాయకమైనప్పటికీ వాటి సంరక్షణ సమస్యగా మారింది. వీటిని పెంచే ప్రాంతాలలో కుకలు, పిల్లులు, ఇతరత్రా జంతువుల వల్ల రైతులు పెంపకానికి వెనకాడుతున్నారు. పైగా వీటి గుడ్ల నిల్వకు శీతల గిడ్డంగుల సౌకర్యం లేక పెంపకందారులు ఎప్పటికప్పుడు వాటిని విక్రయిస్తున్నారు.

అలాగే మొకజొన్న, సోయా వంటి దాణా ధరలు పెరగడంతో పెంపకం భారంగా మారింది. మార్కెట్ సైతం లాభసాటిగా లేదని వాపోతున్నారు. ఈ సవాళ్లను అధిగమించి, స్థిరమైన వృద్ధిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ ఇండస్ట్రీకి తగినంత ప్రోత్సాహకాలు ఇవ్వాలని డీపీఆర్ శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్‌లు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## భారతదేశంలో MG మోటార్ తన విజయవంతమైన 6 ఏళ్ల ప్రయాణాన్ని ఘనంగా జరుపుకుంటోంది




**న్యూఢిల్లీ-నవభూమి:** జేఎస్‌డబ్ల్యూ ఎమ్‌జీ మోటార్ భారతదేశంలో తన ఆరవ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, కంపెనీ పరిమిత కాలానికి ప్రత్యేక వార్షికోత్సవ ధరలు, హెక్టర్ ఆస్టర్ మోడళ్లపై 100% ఆన్-రోడ్ ఫండింగ్ EMI హాలిడే ఎంపికలను ప్రకటించింది. భారతదేశపు మొట్టమొదటి ఇంటర్నెట్ ఎస్‌యూవీ అయిన ఎమ్‌జీ హెక్టర్ పెట్రోల్ మరియు డీజిల్ వేరియంట్లు ఇప్పుడు ప్రత్యేక ధరలతో అందుబాటులో ఉన్నాయి. హెక్టర్ షార్ప్ ప్రో ఎంటి వేరియంట్‌ను INR 19.59 లక్షల (ఎక్స్-షోరూమ్, పాన్-ఇండియా) ప్రభావవంతమైన ప్రారంభ ధర వద్ద కొనుగోలు చేయవచ్చు. వార్షికోత్సవ వేడుకల భాగంగా, ఎమ్‌జీ మోటార్ తన బ్లాక్‌బస్టర్ ఎస్‌యూవీ అయిన ఆస్టర్ వేరియంట్లపై ప్రత్యేక పరిమిత కాలపు ఆఫర్‌ను ప్రకటించింది. ఎమ్‌జీ ఆస్టర్‌ను ఇప్పుడు ?9.99 లక్షల (ఎక్స్-షోరూమ్, పాన్-ఇండియా) ప్రారంభ ధర వద్ద పొందవచ్చు. ఈ వార్షికోత్సవం, హెక్టర్ మరియు ఆస్టర్ మోడళ్లకు ఎస్‌యూవీ ఔత్సాహికులలో ఉన్న ప్రాచుర్యానికి నిదర్శనం, వీటి ప్రత్యేకమైన స్టైలింగ్, ప్రీమియం ఇంటీరియర్లు, టెక్నాలజీ-ఫస్ట్ దృష్టికోణం మరియు ఆకర్షణీయమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిస్టర్. వినయ్ రైనా, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్, జేఎస్‌డబ్ల్యూ ఎమ్‌జీ మోటార్ ఇండియా, ఇలా అన్నారు, “ఈ మైలు రాయి వార్షికోత్సవం మా ప్రయాణాన్ని ప్రతిబింబించడానికి, విజయాలను సంబరంగా జరుపుకోవడానికి ముఖ్యంగా ఎమ్‌జీ హెక్టర్ ఎమ్‌జీ ఆస్టర్ మోడళ్లను తమ జీవితాల్లో ఒక భాగంగా మార్చుకున్న మా విలువైన వినియోగదారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపడానికి ఒక గొప్ప సందర్భం. వినూత్నమైన అమ్మకాల ఆఫర్లు మరియు విశిష్టమైన అమ్మకాల అనంతర సేవలతో కస్టమర్ అనుభవాలను పునర్నిర్వచించడంలో ఎమ్‌జీ ఎప్పుడూ ముందుంటుంది. భారతీయ రోడ్లపై ఇప్పటివరకు 8 బిలియన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణించిన ఎమ్‌జీ హెక్టర్ మరియు ఆస్టర్ మోడళ్లకు మరింత పొదుపు చేసే ఈ ప్రత్యేక ఆఫర్, మా కస్టమర్-సెంట్రిక్ విధానానికి నిజమైన నిదర్శనం.” 2019లో భారతదేశపు మొట్టమొదటి ఇంటర్నెట్ ఎస్‌యూవీగా ప్రవేశించిన ఎమ్‌జీ హెక్టర్, తన ఆధునిక సాంకేతికత, బోల్డ్ డిజైన్, మరియు శ్రేణిలోనే అత్యుత్తమ భద్రతా ప్రమాణాలతో ఎస్‌యూవీ విభాగంలో కొత్త ప్రమాణాలను స్థాపించింది.

ప్రారంభం నుండి హెక్టర్, ఫీచర్-రిచ్, స్మార్ట్ మరియు విశ్వసనీయమైన డ్రైవింగ్ అనుభవాన్ని కోరుకునే ఆధునిక వినియోగదారులకు ప్రాధాన్యతగా మారింది. డ్యూయల్-పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, 35.56 సెం.మీ (14 అంగుళాల) HD టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 70కి పైగా కనెక్టెడ్ కార్ ఫీచర్లు మరియు అధునాతన ADAS సూట్ వంటి క్లాస్-లీడింగ్ ఫీచర్లతో హెక్టర్ మల్టీ-డైమెన్షనల్ ఎస్‌యూవీ అనుభవాన్ని అందిస్తోంది. ఎమ్‌జీ ఆస్టర్, ‘బ్లాక్‌బస్టర్ ఎస్‌యూవీ’గా పేరొందిన ఈ మోడల్, ప్రీమియం ఇంటీరియర్లు మరియు పనోరమిక్ సన్‌రూఫ్‌తో ఆకర్షణీయమైన స్టైల్‌ను అందించడమే కాకుండా, 50కి పైగా భద్రతా ఫీచర్లతో రైడింగ్ అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్తుంది. ఆహ్లాదకరమైన డ్రైవింగ్ అనుభవానికి తోడు, ఎమ్‌జీ ఆస్టర్ 14 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ ఫీచర్లను సమర్పిస్తూ, సాంకేతికతలో ముందంజలో నిలుస్తుంది. ముందువరుసలో వెంటిలేటెడ్ సీట్లు, వైర్లెస్ ఛార్జింగ్, వైర్లెస్ ఆండ్రాయిడ్ ఆటో- ఆపిల్ కార్ ప్లే, ఆటో-డిమ్మింగ్ IRVM వంటి పరికరాలతో కూడిన ఈ ఎస్‌యూవీ, వినియోగదారులకు సౌకర్యవంతమైన మరియు సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అదనంగా, 80కు పైగా కనెక్టెడ్ కార్ ఫీచర్లను కలిగిన అధునాతన i-SMART 2.0 టెక్నాలజీతో, ఆస్టర్ స్మార్ట్ మొబిలిటీకి కొత్త ప్రమాణాలను స్థాపిస్తుంది.

## రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ తగ్గించకున్నా.. ఇలా హెూమ్ లోన్ ఈఎంఐతగ్గించుకోవచ్చు.. 40లక్షలపై 7లక్షలు ఆదా!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది వరుసగా మూడు ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షల్లో రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ). ద్రవ్యోల్బణం రేటు అంచనాల కన్నా దిగువనే ఉన్న క్రమంలో మరోసారి పాలసీ రేట్లను తగ్గించి రుణాలు తీసుకున్న వారికి, తీసుకోవాలనుకుంటున్న వారికి శుభవార్త అందిస్తారని అంతా భావించారు. కానీ, అనుకోకుండా అమెరికా సుంకాల రూపంలో ఎదురైన సమస్య నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 4-6 తేదీల మధ్య జరిగిన సమావేశంలో చర్చించి ఈసారి కీలక పాలసీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 6వ తేదీనే గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ప్రస్తుతం రెపో రేటు 5.50 శాతం వద్ద స్థిరంగా ఉంది. అయితే, ఈ నిర్ణయం హెూమ్ లోన్ తీసుకున్న వారిని నిరాశకు గురి చేసిందని చెప్పవచ్చు. దేశంలో ఇన్‌ఫ్లేషన్ అదుపులోనే ఉన్న క్రమంలో ఆర్‌బీఐ మరోసారి వడ్డీ రేట్లను తగ్గించి ఊరట కల్పిస్తుందని అంతా భావించారు. కానీ, అలా జరగలేదు. దీంతో హెూమ్ లోన్ ఈఎంఐల భారం మరికొన్నాళ్లు ఇలాగే మోయాల్సి వస్తుంది. అయితే, మీరు ప్రస్తుతం గరిష్ఠ వడ్డీ రేటు వద్ద హెూమ్ లోన్ ఈఎంఐ చెల్లిస్తుంటే మీరు ఒక చిన్న ట్రిక్ ఉపయోగించి %జువీ×% తగ్గించుకోవచ్చు. దీర్ఘకాలంలో హెూమ్ లోన్ వడ్డీలో లక్షలు ఆదా చేసుకోవచ్చని చెబుతున్నారు ఆర్థిక నిపుణులు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించక పోయినా ఈఎంఐ తగ్గించుకునేందుకు ఓ మార్గం ఉందంటున్నారు.

నిపుణుల ప్రకారం.. పాలసీ రేట్లలో మార్పులేనందున హెూమ్ లోన్ ఈఎంఐలు సైతం మరికొన్నాళ్లు స్థిరంగానే ఉంటాయి. కానీ, రుణ గ్రహీతలకు ఒక అవకాశం ఉంది. దానిని ఫాలో అయితే ఉదాహరణకు రూ.40 లక్షల హెూమ్ లోన్ 20 ఏళ్ల టెన్యూర్‌పై తీసుకుంటే దానిపై ఏకంగా రూ.7.56 లక్షలు ఆదా చేయవచ్చు. అది ఎలాగంటే సదరు రుణ గ్రహీత తక్కువ వడ్డీ ఉన్న బ్యాంకుకు తమ బ్యాలెన్స్ అప్పును బదిలీ చేసుకోవాలి. ప్రస్తుతం 9 శాతం వడ్డీ పై ఈఎంఐ చెల్లిస్తుంటే దానిని అతి తక్కువ వడ్డీ రేటుకే హెూమ్ లోన్ కల్పిస్తున్న బ్యాంకుకు బదిలీ చేసుకోవాలి. ప్రస్తుతం చాలా బ్యాంకులు 7.30 శాతం నుంచి 7.75 శాతం వరకు వడ్డీ కల్పిస్తున్నాయి. మీరు 7.75 శాతం వడ్డీ ఉన్న బ్యాంకుకు బదిలీ చేసుకుంటే నెలవారీ ఈఎంఐ రూ.3,151 మేర తగ్గుతుంది. ప్రస్తుతం చాలా బ్యాంకులు తక్కువ వడ్డీకే హెూమ్ లోన్స్ కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ బ్యాంకుల్లో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయి. యెస్ బ్యాంకులో 9 శాతం వడ్డీ ఉంటే కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంకులు 7.30 శాతానికే హెూమ్ లోన్స్ ఆఫర్ చేస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా 7.45 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 7.50 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంకులో వడ్డీ రేట్లు 7.55 శాతం నుంచి మొదలవుతున్నాయి. మంచి క్రెడిట్ స్కోర్ ఉండి, లోన్ తిరిగి చెల్లించే సామర్థ్యం ఉన్న వారికి కనిష్ఠ వడ్డీ రేటుకే హెూమ్ లోన్స్ జారీ

## ధర కేవలం 80 పైసలే.. 100 షేర్లు కొంటే 1000 షేర్లు ఉచితం.. బోనస్ రికార్డ్ తేదీ ఇదే!



**న్యూఢిల్లీ-నవభూమి:** స్మాల్ క్యాప్ కంపెనీ మురాయ్ ఆర్గనైజర్ లిమిటెడ్ ) ఇటీవలే బంపర్ ఆఫర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన నేపథ్యంలో ఈ కంపెనీ షేర్లు ఈరోజు మార్కెట్ ఫోకస్లో నిలిచాయి. ఈ స్టాక్ పని తీరును ఇన్వెస్టర్లు నిశితంగా మనిస్తున్నారు. ఈ షేరు కేవలం 80 పైసలకే లభిస్తోన్న ఓ పెన్నీ స్టాక్. ఇందలో షేర్లు కలిగి ఉన్న వారికి, ఈరోజు మార్కెట్లు ముగిసే లోపు షేర్లు కొన్నవారికి బంపర్ ఆఫర్ పొందే అవకాశం ఉంటుంది. ఎంతలా అంటే 100 షేర్లు కొనుగోలు చేస్తే బోనస్ రూపంలో ఏకంగా 1000 షేర్లు వస్తాయి. మరి ఆ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. మిరాయ్ ఆర్గనైజర్ కంపెనీ ఇటీవలే 1:10 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అర్హులైన షేర్ హెూల్డర్లను గుర్తించేందుకు ఆగస్టు 7, 2025ను రికార్డు తేదీగా ఖరారు చేసింది. అయినే స్టాక్ మార్కెట్ నిబంధనల ప్రకారం 1 సెటిల్మెంట్ ఉంటుంది. దీని ప్రకారం రికార్డు తేదీకి ఒక రోజు ముందు అంటే ఆగస్టు 6వ తేదీ వరకు షేర్లు కొనుగోలు చేసిన వారికి అర్హత లభిస్తుంది. ఆగస్టు 6వ తేదీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ముగిసేలోపే ఈ షేర్లు కొనుగోలు చేసినట్లయితే రికార్డుల్లో పేరు నమోదవుతుంది. దీంతో బోనస్ షేర్లు పొందేందుకు అర్హత వస్తుంది.

1:10 రేషియో అంటే 1 షేరుకు 10 షేర్లు బోనస్‌గా ఇస్తారు. బుధవారంలోపు ఈ షేర్లు కొనుగోలు చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. రికార్డ్ తేదీ ఆగస్టు 7 ఉన్నప్పటికీ ఆరోజు కొనుగోలు చేస్తే అర్హత లభించదు. మరోవైపు బోనస్ షేర్లు జారీ చేయడం ద్వారా షేర్ల సంఖ్య పెరుగుతుంది కానీ, మీ పోర్ట్ ఫోలియో విలువలో మార్పు ఉండదు. షేరు విలువలో సవరణలు చేస్తారు. ఉదాహరణకు రికార్డు తేదీలోపు 100 షేర్లు కొనుగోలు చేస్తే షేరు ధర 80 పైసలు కాబట్టి వాటి విలువ రూ.80 అవుతుంది. వారికి 1,000 షేర్లు బోనస్ రూపంలో ఉచితంగా లభిస్తాయి. ఇక్కడ షేర్ల సంఖ్య పెరుగుతుంది. కానీ విలువ రూ.80గానే ఉంటుంది. కంపెనీలు స్టాక్ స్ప్లిట్, బోనస్ ప్రకటిస్తుంటాయి. ఇటీవలి కాలంలో చాలా కంపెనీలు ఈ నిర్ణయం తీసుకుంటున్నాయి. మురాయ్ ఆర్గనైజర్ సంస్థ సైతం ఇదే సమయంలో బోనస్ షేర్లు ప్రకటించడం ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించిందని చెప్పవచ్చు. షేరు ధర 80 పైసల వద్ద ఉంది. ఇది ఒక పెన్నీ స్టాక్. ఇలాంటి షేర్లలో పెట్టుబడి అనేది రిస్క్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

## రష్యా చమురు విషయంలో.. భారత్‌ను ‘ట్రంప్’ ఎందుకు ఆపలేకపోతున్నారు?



**న్యూఢిల్లీ-నవభూమి:** రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆపకుంటే సుంకాలతో పాటు భారీగా పెనాల్టీలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే బెదిరించిన సంగతి తెలిసిందే. కానీ, ఆ బెదిరింపులకు భారత్ తలొగ్గలేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. రష్యా ఆయిల్ కొనుగోలు ఆపాలని కేంద్రం ప్రకటన చేసినట్లు వచ్చిన వార్తలను ఖండించింది. బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేసింది. రష్యా చమురును కొనుగోలు చేయడంలో భారత్‌ను ట్రంప్ బెదిరింపులు నిలువరించలేక పోతున్నాయని స్పష్టంగా తెలుస్తోంది. అందుకు గల కారణాలు తెలుసుకుందాం. ట్రంప్ తాజా బెదిరింపులు భారతదేశ చమురు దిగుమతులపై ప్రభావం చూపే అవకాశం లేదు. రష్యా నుంచి చమురు కొనడం భారతదేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే కొనసాగుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ధర తక్కువగా ఉంటే రష్యా నుంచి ముడి చమురు కొనడానికి భారతదేశం వెనుకాడదని, ఈ విషయంలో వినియోగదారుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా పర్యటనలో ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భారతదేశ చమురు శుద్ధి పరిశ్రమలు రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేయడాన్ని కేంద్రం సమర్థిస్తోంది. పశ్చిమ ఆసియా, అమెరికా నుంచి కొనే ధర కంటే రష్యా చమురు తక్కువ ధరకు లభిస్తుండటంతో దేశీయంగా ధరలు అదుపులో ఉంటున్నాయని తెలిపింది. దీని ద్వారా యూరోపియన్ దేశాలకు కూడా ప్రయోజనం కలుగుతోందని గుర్తు చేసింది. ‘మేము మా వినియోగదారుల ప్రయోజనాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాం. ధరల పరంగా ఉత్తమమైన ఎంపికను ఎంచుకుంటాం. ఇతర వనరుల నుంచి పొందే దానికంటే రష్యన్ ముడి చమురు చౌకగా ఉంటే, మన వినియోగదారులను ఎందుకు శిక్షించాలి?’ అని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి అన్నారు. ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో మాస్కో నుంచి చమురు ధరలపై మరింత డిస్కౌంట్లను అన్వేషించే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చలేదు. ట్రంప్ తాజా ప్రకటనపై వ్యాపార వర్గాలూ స్పందించాయి. ప్రభుత్వ విమర్శలను సమర్థించాయి. భారతదేశం రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం పారదర్శకంగా జరిగిందని, అమెరికాకు కూడా ఈ విషయం తెలుసని పేర్కొన్నాయి. ‘భారతదేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి గల ముఖ్య కారణాలలో ఒకటి పాశ్చాత్య ఆంక్షలు సాంప్రదాయ సరఫరా గొలుసులను దెబ్బతీసిన తర్వాత ప్రపంచ చమురు మార్కెట్లను స్థిరీకరించడానికి సహాయపడటం. విభిన్నమైన, సరసమైన ఇంధన లభ్యతను కొనసాగించడం ద్వారా, భారతదేశం ప్రపంచ చమురు ధరల పెరుగుదలను నిరోధించింది. చమురు వాణిజ్యాన్ని పేర్కొంటూ భారతదేశంపై ట్రంప్ సుంకాలు పెంచాలని నిర్ణయించడం సమర్థనీయం కాదు. ఇది మార్కెట్ వాస్తవాలను విస్మరిస్తుంది, వాణిజ్య డేటాను తప్పుగా సూచిస్తుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కీలకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది’ అని జీటీఆర్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, మార్కెట్ పరిస్థితుల కారణంగా మే నెలలో రష్యా నుంచి భారతదేశం దిగుమతి చేసుకునే చమురు 10 శాతం మేర తగ్గి 9.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మరోవైపు ట్రంప్ బెదిరింపులు అమెరికన్ కొనుగోలుదారులలో అనిశ్చితిని కలిగిస్తాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. క్రిస్మస్ సీజన్ కోసం భారతీయ ఎగుమతిదారులతో అమెరికన్లు చర్చలు జరుపుతున్నారు. భారత ప్రభుత్వం వ్యవసాయం, పాడి పరిశ్రమల విషయంలో కఠినంగా వ్యవహరించడం ట్రంప్‌కు

## బ్రిటన్‌కు మరిన్ని మత్స్య ఎగుమతులు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన దేశ మత్స్య ఎగుమతులకు బాగానే కలిసి రానుంది. ప్రస్తుతం బ్రిటన్ మన దేశం నుంచి ఎగుమతయ్యే మత్స్య దిగుమతులపై 8.9 శాతం చొప్పున దిగుమతి సుంకం విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఈ సుంకం పూర్తిగా రద్దు కానుంది. దీంతో ప్రస్తుతం ఏటా బ్రిటన్‌కు రూ.1,000 కోట్ల వరకు ఉన్న మన మత్స్య ఎగుమతులు వచ్చే మూడేళ్లలో మూడింతలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎఫ్‌టీఏ తీర ప్రాంతం ఎక్కువగా ఉన్న గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బాగా మేలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే రొయ్యల ఎగుమతుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ఏపీ నుంచే ఎగుమతవుతాయి. ట్రంప్ సుంకాలతో బేల చూపులు చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతిదారులకూ భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ కలిసిరానుంది. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో బ్రిటన్‌లోని దిగుమతిదారులు ధరలు తగ్గించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం.. ధరలు ఎలా ఉన్నాయంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** శ్రావణమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో గోల్డ్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. పసిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగారం ధర లక్ష రూపాయలను దాటేసి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈరోజు (ఆగస్టు 6న) ఉదయం 10:30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,230కి చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.92,794కి చేరుకుంది. అయితే, నిన్నటితో పోల్చుకుంటే గోల్డ్ ధర స్వల్పంగా తగ్గిందని చెప్పొచ్చు. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1,00,840కి చేరుకోగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ.92,437కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.101,170కి చేరుకోగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.92,739కి చేరింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం..

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

ఢిల్లీలో రూ.1,01, 040, రూ.92,620
ముంబైలో రూ. 1,01,040, రూ. 92,620
హైదరాబాద్‌లో రూ.1,01,180, రూ. 92,748
బెంగళూరులో రూ.1,01,120 , రూ.92,693
విజయవాడలో రూ.1,01,180, రూ.92,960
వడోదరలో రూ. 1,01,170, రూ.92,739
కోల్‌కతాలో రూ.1,00,900, రూ. 92,492
చెన్నైలో రూ. 1, 01, 330, రూ.92,886

## కైలాస్ యాత్ర మార్గంలో చిక్కుకున్న యాత్రికులు.. 413 మందిని రక్షించిన ఐటీబీపీ సిబ్బంది

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో బీభత్సం సృష్టిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్ కిన్నౌర్ జిల్లాలో భారీ వరదల కారణంగా కైలాస్ యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకుపోయారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్
బుధవారం
06 । ఆగస్టు । 2025



# దళితులపై అనుచిత వ్యాఖ్యల కేసులో నటి మీరా మిథున్

**చెన్నై-నవభూమి:** దళితులపై అనుచిత వ్యాఖ్యల కేసులో తమిళ సినీ నటి మీరా మిథున్ ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మూడేళ్లుగా పరారీలో ఉన్న ఆమెను ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 11న కోర్టులో హాజరు పరచనున్నారు.

వివరాల్లోకి వెళితే.. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో 2021 ఆగస్టులో మీరా మిథున్, ఆమె స్నేహితుడు శ్యామ్ అభిషేక్‌ను అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరు కాకపోవడంతో 2022లో అరెస్ట్ వారెంట్ జారీ అయింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న మీరా మిథున్‌ను రక్షించి తమకు అప్పగించాలని కోరుతూ ఆమె తల్లి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం కోర్టులో విచారణకు వచ్చింది.

అప్పుడు చెన్నై లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఢిల్లీలో ఉన్న లీగల్ సర్వీసెస్ అథారిటీకి సంబంధిత సమాచారం ఇచ్చి, ఢిల్లీ పోలీసుల సాయంతో ఆమెను గుర్తించి అక్కడున్న ప్రభుత్వ హోంలో ఉంచినట్లు పోలీసులు వెల్లడించారు.

నవచిత్ర



# ఫ్లాపులతో కొట్టుమిట్టాడుతున్న మృణాల్.. బుట్ట సర్దాల్సిందేనా?



హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది.పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు 5 సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగా ఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ, సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బస్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది. దాంతో వారంలోపే డిజాస్టర్ మూవీగా తేలిపోయింది ఈ సినిమా. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాపైనే ఉన్నాయి. సాధారణంగా అడివి శేష్ సినిమాలు అంటే మంచి కంటెంట్ తో వస్తాయని అందరికీ తెలిసిందే.

# సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై అందుకే స్పందించను : చిరంజీవి



సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌పై తాను స్పందించనని తెలిపాడు అగ్రనటుడు చిరంజీవి. ఫీనిక్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్‌కి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు నటుడు చిరంజీవి, తేజ సజ్జా. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన ఒక జర్నలిస్ట్ వలన వచ్చిందని ఈ విషయంలో అతడికి ఎప్పుడూ రుణపడి ఉంటానని చిరంజీవి అన్నారు.

ఈ కార్యక్రమంకి వచ్చి బ్లడ్ డోనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజసజ్జాకు కూడా బ్లడ్ డోనేట్ చేసినందుకు ధన్యవాదాలు. రక్తదానం పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా ఒక విషయం మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. ఎవరో ఒకరు రాజకీయ నాయకుడు కారణం లేకుండా నన్ను విమర్శించడం మొదలుపెట్టాడు. నేను ఇప్పుడూ రాజకీయల్లో కూడా లేను. అయిన కూడా అప్పుడప్పుడు విమర్శలు వస్తునే ఉంటాయి. అయితే ఈ నాయకుడు ఒకరోజు ఎదో ముంపు ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఒక మహిళ అతడిని నిలదీస్తూ.. చిరంజీవిని అలాంటి మాటాలు అనాలని మీకు ఎందుకు అనిపించిందంటూ కడిగి పారేసింది. దీంతో ఆ వీడియో చూసి ఎమోషనల్ అయ్యాను. ఆ తర్వాత ఆమె వివరాలు తెలుసుకోగా.. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిసి నాకు గుండె ఉప్పొంగింది.అయితే సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై నేను ఎందుకు స్పందించరంటూ అందరూ నన్ను అడుగుతారు. నేను ఎప్పుడూ స్పందించను. నేను చేసే మంచి పనులు నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. విమర్శలపై నేను స్పందించాల్సిన పనిలేదు. నా మంచితనమే మాట్లాడుతుందంటూ చిరంజీవి చెప్పుకోచ్చాడు.

# నవ మన్మథుని సీక్రెట్ ఏమిటంటే..



టాలీవుడ్‌లో వయసుతో పని లేకుండా స్టైల్, హ్యాండ్సమ్‌తో మెరిసే హీరో ఎవరు అంటే, ఠక్కున గుర్తుకు వచ్చే పేరు కింగ్ నాగార్జున. ఆరుపదుల వయస్సు దాటిన కూడా ఇంకా యంగ్ హీరోల మాదిరిగా కనిపిస్తున్నాడు. నాగ చైతన్య, అఖిల్‌లకి నాగార్జున అన్నయ్యలా ఉంటాడే తప్ప తండ్రిగా అస్సలు కనిపించరు. నాగ్ ఎక్కడికి వెళ్లి కూడా ఆయన ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటనే ప్రశ్న ఎదురవుతూనే ఉంటుంది. ఇటీవల కూలీ సినిమా ప్రమోషన్స్ సమయంలో నాగార్జునని రజనీకాంత్ తెగ పొగిడేశారు. ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటని నేను అడిగితే వ్యాయామం చేయడమే అని నాకు చెప్పారు అని రజనీకాంత్ అన్నారు.అయితే తాజాగా కూలీ ప్రమోషన్స్ సమయంలో నాగార్జున తన ఫిట్‌నెస్ కి సంబంధించిన కొన్ని విషయాలు పంచుకున్నారు. ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల నుంచి 1 గంట వరకు వ్యాయామం తప్పనిసరిగా చేస్తాను. ఏకకాలంలో ఒకే టైపు వర్కౌట్స్ కాకుండా ఓ రోజు వెయిట్ ట్రైనింగ్, మరో రోజు ట్రెడ్ మిల్ మీద రన్నింగ్, ఒక రోజు స్విమ్మింగ్, మరో రోజు వాకింగ్ ఇలా భిన్న రకాల వర్కౌట్స్ చేస్తూ శరీరానికి కొత్త ఉత్సాహం అందిస్తాను. వ్యాయామ సమయంలో ఫోన్ చూడను, మధ్యలో బ్రేక్స్ తీసుకోను. రోజులో 12 గంటల పాటు మాత్రమే ఆహారం తీసుకుంటాను, మిగతా 12 గంటలు ఉపవాసం ఉంటాను. ఉదయం పూట డైట్ ఏంటంటే.. కిమ్చి, ఉడికించిన క్యాబేజీ, బ్రొకోలి, కొద్దిగా కూరగాయ ముక్కలు, గోరువెచ్చిన నీరు, కాఫీ.మధ్యాహ్నం భోజనంలో పప్పు, కూర, పచ్చడి, నాన్‌వెజ్‌తో సంపూర్ణ భోజనం చేస్తాను. రాత్రి డిన్నర్ సాయంత్రం 7 - 7.30 మధ్యలో పూర్తి చేస్తాను..అందులో సలాడ్స్, చికెన్ లేదా ఫిష్ ఉంటాయి. స్వీట్స్ అంటే ఇష్టం. కానీ అధికంగా తినను. ఒక్కోసారి స్వీట్ తింటే, మరుసటి రోజు హెవీ వర్కవుట్ చేస్తాను.. లేట్ నైట్ షూటింగ్‌లు లేకపోతే ప్రతిరోజూ ఒకే టైంకి పడుకుంటాను. సెలబ్రిటీల జీవితంలో ఒత్తిడులు తప్పవు. కానీ అవసరం లేని విషయాల గురించి ఆలోచించొద్దు అని నా తండ్రి ఇచ్చిన సలహాని పాటిస్తుంటాను అని నాగార్జున స్పష్టం చేశారు. అయితే ఈ ఫిట్‌నెస్ సీక్రెట్స్ అనుసరించడం చాలా వరకూ సాధ్యమే. కాని ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చి, డిసిప్లిన్‌గా ఉంటేనే ఫలితం వస్తుంది. అందుకే ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలంటే సరైన డైట్, వ్యాయామం, నిద్ర ఈ మూడు మీ జీవితంలో భాగం చేయండి!

# పెద్ద స్టార్లతో నటిస్తే ఇబ్బందులు పడాలి.. రాజ్ బీ శెట్టి




యాక్టర్‌గా, దర్శకుడిగా, రైటర్‌గా, నిర్మాతగా కన్నడ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్ సంపాదించుకున్న నటుల్లో టాప్‌లో ఉంటాడు రాజ్ బీ శెట్టి. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ నిర్మించిన సు ఫ్రమ్ సో ఇటీవలే విడుదలై బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఆగస్టు 8న తెలుగులో విడుదల కానుంది. కాగా రాజ్ బీ శెట్టి తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన జర్నీ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు.మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌ను డైరెక్ట్ చేస్తున్నాడన్న పుకార్లను కొట్టిపారేశాడు రాజ్ బీ శెట్టి. అలాంటి కాంబినేషన్ ఏం లేదని చెప్తూనే తాను ప్రస్తుతం ఓ థ్రిల్లర్ ప్రాజెక్టుపై బిజీగా ఉన్నానని చెప్పాడు. అయితే ఆ ప్రాజెక్ట్ ఏంటనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశాడు.ఇక స్టార్ యాక్టర్లతో (పెద్ద స్టార్లతో) నటించేందుకు ఆసక్తి చూపించకపోవడంపై ప్రశ్నించగా.. అలాంటి స్టార్లతో నటించేటప్పుడు తరచూ షెడ్యూల్స్‌లో విభేదాలు తలెత్తి కష్టాలు పడాల్సి వస్తుందంటూ చెప్పుకొచ్చాడు. ఒకవేళ పెద్ద స్టార్లతో చేయాల్సి వస్తే తాను ఎంతగానో అభిమానించే శివరాజ్‌కుమార్‌తో నటించేందుకు రెడీ అన్నాడు. రాజ్ బీ శెట్టి ప్రస్తుతం 45 సినిమాలో నటిస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 15న విడుదల కానుంది.

# ప్రపంచ రికార్డ్ బ్రేక్ చేసిన దీపిక.. ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డ్!



ఈ మధ్యకాలంలో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే కొత్తవాళ్లను మొదలుకొని సీనియర్ స్టార్ సెలబ్రిటీల వరకు చాలామంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఈ సోషల్ మీడియా ఖాతాల ద్వారా తమకు సంబంధించిన ప్రతి విషయాన్ని అభిమానులతో పంచుకుంటున్నారు. అలాగే ప్రమోషనల్ వీడియోలు కూడా షేర్ చేస్తూ.. ఒకవైపు ఆర్థికంగా ఎదుగుతూనే.. మరొకవైపు అరుదైన రికార్డులు కూడా క్రియేట్ చేస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే కూడా చేరిపోయింది. ఈమె చేసిన ఒక్క రీల్ ఏకంగా ప్రపంచ స్థాయి రికార్డును బ్రేక్ చేయడమే కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డు అందుకుంది దీపిక పదుకొనే. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా దీపికా పదుకొనే హిల్టన్ అనే హోటల్ యాడ్ కోసం పనిచేసింది. ఈ యాడ్ కు సంబంధించిన వీడియోని ఆమె తన సోషల్ మీడియా ఖాతా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. అయితే ఈ రీల్ షేర్ చేసిన 8 వారాలలోనే.. ఏకంగా 1.90 బిలియన్ల(190 కోట్ల )వ్యూస్ వచ్చాయి. దీంతో ఇది ప్రపంచంలోనే అత్యధిక వ్యూస్ రాబట్టిన రీల్ గా రికార్డ్ సృష్టించింది. అయితే ఇప్పటివరకు ఈ రికార్డు హార్దిక్ పాండ్య (1.6 బిలియన్లు)పై ఉండేది ఇప్పుడు ఆ రికార్డును దీపికా పదుకొనే బ్రేక్ చేసింది. ఇకపోతే దీపిక పదుకొనే కి ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారుగా 80 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఇదిలా ఉండగా మరోవైపు ఈ అరుదైన రికార్డును అందుకోవడంతో దీపికాపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందులో భాగంగానే కొంతమంది ఫాలోవర్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక నెలలో రెండు బిలియన్ వీక్షణలు సాధించడం మామూలు విషయం కాదు అని ఒక నెటిజన్ కామెంట్ చేస్తే.. మరొక నెటిజన్ 1.9 బిలియన్ అంటే ఎంత? నేను మొదటిసారి బిలియన్ వీక్షణాలను చూశాను అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఇంకొక అభిమాని ఇది కేవలం ఒక ఆడ్ మాత్రమే.. ఇక మీరే ఊహించండి.. ఒక ప్రకటనకే దీపిక ఇంత వైరల్ అయింది అంటే.. ఆమె నిజంగా ఎంత ఐకానిక్ అని ఆలోచించండి అంటూ.. ఇలా ఎవరికి వారు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. మొత్తానికైతే దీపిక సాధించిన ఈ రికార్డుకి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి చివరిసారిగా కల్కి 2898సినిమాలో కనిపించిన ఈమె.. ఈ సినిమా తర్వాత సింగం ఎగైన్ అనే సినిమాలో కూడా నటించింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కొంతకాలం విశ్రాంతి తీసుకున్న దీపిక.. మళ్లీ వరుస పెట్టి సినిమాలు ప్రకటిస్తోంది. అందులో భాగంగానే అట్లీ, అల్లు అర్జున్ కాంబినేషన్లో వస్తున్న సినిమాలో అవకాశం అందుకుంది.అలాగే షారుఖ్ ఖాన్,సుహానా ఖాన్, అమితాబ్ బచ్చన్ కాంబినేషన్లో వస్తున్న కింగ్ అనే సినిమాలో కూడా అవకాశం లభించింది.

# ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో మంచు మనోజ్ కొత్త సినిమా..




టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి.

ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడుఢిల్లీలో పెరిగాడు%% ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు.సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఒక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. 21 టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897 - 1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# మెరిసిన సుహాస్, నిత్య



**హైదరాబాద్-నవభూమి:** జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిపలో తెలంగాణకు చెందిన సుహాస్ ప్రీతమ్, శ్రీనిత్య పతకాలు నెగ్గారు. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన 200మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో సుహాస్‌కు రజతం, 400మీ. మెడ్లేలో నిత్యకు కాంస్యం దక్కాయి.

# చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌కు అర్జున్, హారిక



**చెన్నై-నవభూమి:** గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లపాటు సాగే ఈ టోర్నీలో 19 మంది జీఎంలు పాల్గొననున్నారు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి ఆడనున్నారు.

నవక్రీడ

# బాక్సింగ్‌లో మరో ఏడు పతకాలు ఖాయం



**బ్యాంకాక్-నవభూమి:** ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిపలో మరో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలు ఖరారు చేసుకున్నారు. మంగళవారం జరిగిన అండర్-19 పోటీల్లో యషిక (51 కిలోలు), నిష (54 కి), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిక (65 కి), ఆకాంక్ష (70 కి), ఆర్తి కుమారి (75 కి) సెమీస్‌కు చేరారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**